# విషాదాంతం

నాగభూషణ్

పాత్రలు

ప్రసాదరావు రంగయ్య
రామమోహన్ గోపాలం
సూర్యం విజయ
చంద్రం కుసుమ

## మొదటి రంగం

తెరలో: సోదర సోదరీమణులారా! సమాజంలోని కుళ్ళును వెలికి తీసి, వినూత్న పంథాలో సజీవ సమాజాన్ని స్థాపించి, వనజీవనానికి నాందీ ప్రస్థావన చెయ్యాలంటే మనిషికీ మనిషికీ మధ్యనున్న ఈ తెరను లాగివెయ్యండి.

(తెర త్వరగా తొలిగిపోతుంది. అది ప్రసాదరావుగారి మేడలో ముందు హాలు. వాకిట్లోకి, వెనక తోటలోకి, ఇంటి లోపలి భాగానికి పోవడానికి మూడు విడివిడి వాకిళ్లు వున్నయ్. నవనాగరిక ప్రపంచంలో సాధారణంగా ధనవంతుల ఇళ్ళల్లో కనిపించే ఏ వస్తువూ ఆ గదిలో వుండకుండా ఇద్దరూ, ఏదో గంభీరంగా ఆలోచిసూ&త, ఎంతకూ ఒక నిర్ణయానికి రాలేకపోవడం వల్ల విషాద వదనాలతో కనిపిస్తారు. ఒకసారి ఒకరికేసి ఒకరు, మరొకసారి ప్రేక్షకులవంక చూస్తారు. చివరకు ఒకడు ఏదో నిశ్చయపరుచుకున్నట్లుగా తలపంకించి, లేచి, ముందుకు వచ్చి, ప్రేక్షకులకు నమస్కరిస్తాడు)

సూర్యం: సోదర సోదరీమణులారా! నమస్కారం. నా పేరు సూర్యం. ప్రసాదరావుగారి రెండో అబ్బాయిని. ప్రస్తుతం కాలేజీలో బి.ఏ. చదువుతున్నాను. ఇహ మా వాడు –

(రెండో అతన్ని చూపిస్తాడు)

చంద్రం: నమస్తే! నా పేరు చంద్రం. నేనూ, సూర్యం ఒకే క్లాసులో చదువుతున్నాం. ప్రపంచానికి పై సూర్యచంద్రులు ఎలాగో, మా కాలేజీకి మేమూ అంతే – అయితే పై వాళ్లు ఒకరు వున్నప్పుడు మరొకరు వుండరు, కాని మేం ఇద్దరం లేకుండా ఎప్పుడూ వుండం –

సూ: మావాడు చెప్పినవన్నీ నిజమే. అయినా, ఈ నాటకంలో మే ఏ పాత్రలను ధరిస్తున్నామో, మాకే తెలియదు. నిజానికి ఈ నాటకానికి ప్రయోక్త మా నాన్న. నాయకుడు మా అన్నయ్య...నాయిక ఎవరో ఇంకా నిర్ణయిం కాలేదనుకోండి – (ఒక్క క్షణంఆగి) అన్నట్లు, చెప్పడం మరిచాను – మా నాటికి 'విషాదాంత'..... (చంద్రం కేసి తిరిగి) ఎలా వుందిరా?

చం: ఏడిసినట్లుంది.

సూ: (బిక్కచచ్చి) ఏం?

చం: ఏం ఏమిటి? 'ఇది విషాదాంత నాటకం' అని ముందే చెబితే ఆడియన్సులో ఒక్కడు ఉంటాడా హాలులో? అయినా, వీరందరూ ప్రజ్ఞాధురంధరులూ, అశేష శేముషీ విభవం కలవారు – వాళ్ళకు ఆ మాత్రం తెలియదా, ఇది సుఖాంతమో, విషాదాంతమో?

సూ: అయితే ఏం చేద్దామంటావ్?

చం: ఉపోద్ఘాతం లేకుండానే నాటకం మొదలు పెడితే ఎంత బావుంటుంది? ఓ! అరుగో, మీ నాన్నగారు వస్తున్నారు, ప్రేక్షకులకు పరిచయం చెయ్యి...

(ప్రసాదరావుగారు వస్తాడు. మనిషికి నలభై అయిదు సంవత్సరాల వరకు వుంటయ్. సిల్కు లాల్చీ, మల్లు ధోవతి, ఆధునాతన నవనాగరిక వేషం)

సూ: సోదరీ సోదరులారా! వీరు మా నాన్నగారు. ఈ నాటకానికి ప్రయోక్త. అకళంక దేశభక్తులు; నిస్వార్థ ప్రజాసేవకులు కావడం వల్లనే వారికి అంత గౌరవం. గౌరవం ద్వారా ధనం; ధనం ద్వారా పలుకుబడి –

ప్రసా: ఏమిట్రా యిదంతా?

సూ: ప్రయోక్తగారిని ప్రేక్షకులకు పరిచయం చేస్తున్నాం నాన్నా.

ప్రసా: ఏడిసినట్లుంది. ఈ నాటకాలతో నీకు పిచ్చి ఎక్కుటట్లుగా వుంది.

చం: అది మాత్రం అసంభవమండీ!

ప్రసా: ఏం?

చం: మనిషికి రెండుసార్లు ఎలా పిచ్చెక్కుతుంది చెప్పండి.

సూ: అంటే, నన్ను ఇదివరకే పిచ్చివాణ్ణి చేశావేరా?

చం: ఒక్కసారి 'నాటకాల పిచ్చి' ఎక్కిం తర్వాత, ఒక 'నాటకాలతో పిచ్చి' ఎలా ఎక్కుతంది?

సూ: భేష్! ఆలస్యంగా సమర్థించినా అద్భుతంగా సమర్థించావురా!

ప్రసా: ఎంత మిడిసిపడుతున్నావురా? మా కాలంలో యిట్లాగా? పెద్దవాళ్ళ ఎదట ఇలా నిలబడి మాట్లాడేవాళ్ళమా? ఆ రోజుల్లో పిల్లకు ఎంత వినయం, ఎంత విధేయత?

సూ: అవునవును ఎంత భయం? ఎంత భక్తి?

ప్రసా: నువ్వు వెక్కిరించినంత మాత్రాన వాళ్ళ గొప్పతనం ఎక్కడికీపోదు....సరే కాని, అన్నయ్య రాత్రి వచ్చాడట, క్రిందికి వచ్చాడా?

సూ: వాడికింకా తెల్లవారిందో లేదో? నేను వెళ్ళి మేలుకొలుపు పాడివస్తాను.

ప్రసా: రక్షిస్తావ్ – వెళ్ళు –

సూ: మళ్ళీ వస్తానుగా – రా, రా చందమామ!

(వెళ్ళిపోతాడు)

(రోజులు ఎంత మారాయ్ మా రోజుల్లో అనుకుంటూ సోఫాలో కూర్చుంటాడు ప్రసాదరావు. ఓ క్షణం తర్వాత కాఫీ తీసుకుని విజయ వస్తుంది. వయసు పంథొమ్మిది, ఇరవై సంవత్సరాలు. అందమైన ఆమెను వినయం మరీ శోభనిచ్చింది.)

ప్రసా: (కాఫీ తీసుకుంటూ) ఏవమ్మా! మీ చినబాబు గారు లేచాడా?

విజ: ఇంకా లేవలేదు. చాలా పొద్దుపోయి పడుకున్నట్లున్నాడు.

ప్రసా: నేను ప్రశ్న వెయ్యకుండానే ఏదో సమాధానం చెప్పు....అయినా, వాడు చేస్తున్నవేం బావుండడం లేదు. మొన్న అయిదు వందలు తీసుకు వెళ్ళి వారం రోజుల్లో వట్టి చేతుల్లో తిరిగివచ్చాడు. ఇన్నేళ్లు వచ్చిన తర్వాతనయినా కాస్త యింటిమీద ధ్యాస వుంచుకోకపోతే ఎలా?

విజ: మీరొక్కసారి చెప్పిచూడండి.

ప్రసా: అదే నేనూ అనుకుంటున్నాను. వాడు లేచిన తర్వాత ఒకసారి నా దగ్గరకు రమ్మను. – (విజయ వెళ్ళబోతుంది) అన్నట్లు, మీ నాన్నగారు ఈ పూటనే కదూ వస్తారన్నావ్?

విజ: అవును.

ప్రసా: మీ అన్నయ్య?

విజ: అన్నయ్య కూడా వస్తాడనే పాలేరు చెప్పాడు.

ప్రసా: నేనే వాళ్ళకు కబురు చేశాను విజయా! మీ అన్నయ్య సీతను పెళ్లిచేసుకోనన్నాడట! నాకేమీ బాగాలేదు.

విజ: (అవునన్నట్లుగా తలతిప్పుతుంది)

ప్రసా: (దానవల్ల ప్రోత్సాహితుడై) చూడమ్మా! ముందు మాట ఇవ్వడమెందుకు? తరువాత వాళ్ళు అటువంటి వాళ్ళని, ఇటువంటి వాళ్ళని వంకలు పెట్టడం దేనికి?

విజ: క్రిందటిసారి వచ్చినప్పుడు నేనూ ఆ మాటే చెప్పాను.

ప్రసా: అయినా, తెలిసినవాళ్లు.....మీ అంత బాగా లేననుకో – అంతమాత్రాన వదిలివేస్తామా? ఇవ్వాళ నేను ఖచ్చితంగా చెప్పదలుచుకున్నాను. ఇటువంటి మాట తప్పేమనిషి మీ నాన్నతరువాత నా ఆస్థికి ఆజమాయిషీ చేస్తున్నాడంటే నా కెంత అప్రతిష్ట?

విజ: నిజం –

ప్రసా: కొంచెం నువ్వు కూడా చెప్పమ్మా....ఆ సీత వచ్చి నిన్న ఎలా ఏడ్చిపోయిందో చూశావుగా! అయినా ఈ ఆడవాళ్ళంతా అంతేలే! మగవాడు ఆశపడ్డప్పుడు అంతా మునిగిపోయినట్లు దగ్గరకే రారు. తీరా మగవాడు విసుగుపుట్టి విరమించుకున్న తర్వాత కాని తెలిసి రాదు.

(విజయ మాట్లాడదు)

అయినా మా కాలంలో ఇట్లాగా? తల్లిదండ్రులు ఏ పిల్లను పెళ్ళిచేసుకోమంటే, ఆ పిల్ల మెళ్ళో మంగళసూత్రం కట్టేవాళ్ళం. ఇవ్వాళ? ఏముంది? చెట్టు చెడే కాలానికి కుక్క మూతి పిందెలు.

(సూర్యం, చంద్రం వస్తారు)

సూ: ఎవరి సంగతి నాన్నా? ఈ కాలంలో పిల్లలేనా? అవును...మరీ అదుపూ, అజ్ఞా లేకుండా పోతున్నారు – అన్నయ్య చూడు! ఇంతవరకు లేవలేదు. వాడికి మనవాళ్ళ మేలుకొలుపులు పనికి రాలేదు. అయినా....సరే! అక్కడ జరిగిందంతా చెప్పరా చంద్రం.

చం: ఏముంది?

సూ: ఏమీ లేకపోతే నువ్వు చెప్పేదేమిటి? వున్నదే చెప్పు....

చం: అదే! గదిలోకి వెళ్ళాం. నిద్రా దేవతరామాన్ని తన ఒళ్ళో పెట్టుకుని ఆప్యాయంగా లాలిస్తోంది. మెల్లగా తట్టి లేపాం. ఉహూ! బిగ్గరగా మాట్లాడాం? ఆ దేవత వదలదే! కొట్టాం, తిట్టాం! అబ్బే! అవన్నీ చెవిటి

ముందు శంఖాలయినాయ్.

సూ: ఇహ తెమిల్చి ఏడవ్వోయ్.

విజ: (నవ్వుతూ) ఏది ముందు చెయ్యమంటావ్?

చం: అంటే – ?

విజ: తేల్చడమా? ఏడ్వడమా? ఏది ముందు చెయ్యాలి అని?

చం: రెండూ చెయ్యకుండానే తప్పించుకుంటూనుగా! మహా మహా ప్రిన్సిపాలు గారి క్లాసు ఎగగొట్టి అటెండెన్సు వేయించుకుంటూ వుండగా లేనిది ఇదో లెక్కా? ఇన్ని చేసినా రామం లేవలేదు. చివరకు సంగీతం మొదలుపెట్టాం. ఇంకేం టక్కున లేచి కూర్చున్నాడు. లేచినవాడు వూరుకున్నాడా? లేచి –

ప్రసా: చెప్పు చంద్ర. సస్పెన్సు దేనికి?

చం: అదే! లేచి, 'చాకలి వాళ్ళు వచ్చారేమో చూడరా' అన్నాడు.

సూ: "చాకలి వాళ్ళు ఇప్పుడెందుకు వస్తార్రా" అన్నాను నేను.

చం: అబ్బే ఏమీలేదు. వాటి స్నేహితులకోసం వచ్చిన గాడిదలలను తోలుకుపోవడానికి' అన్నాడు రామం.

సూ: ఈ కాలం పిల్లలు చూశావా నాన్నా! ఇంతకూ నాటకం సంగతి ఏం చేశావ్ నాన్నా?

ప్రసా: నీకెప్పుడో చెప్పాను కదరా, సూర్యచంద్రాదులు అడ్డమైనా ఈ నాటకం ఆగదు.

చం: ఎవరు? మేమే!

ప్రసా: కాదు....(పైకి చూపుతూ) వాళ్లు.

చం: రక్షించారు....అంటే – 'నిటలాక్షుండిపుడెత్తి వచ్చినను రాని' మాదిరిగా నంటారు. (తన ఉపమానానికి తనే మురిసిపోయి) ఎట్లా వుందిరా కపారిజన్?

సూ: (తేల్చేస్తూ) ఫరవాలేదు.

చం: ఇంత గొప్పగా పోల్చినందుకు అమాంతం అభినందించక ఫరవాలేదని నానుస్తావేరా?

సూ: నేను 'ఫరవాలేదు' అంటే మీ తెలుగు లెక్చరరు గారి 80% మార్కులతో సమానం తెలుసా?

చం: (హుషారుగా) థాంక్స్.

సూ: (చంద్రం వైపు చూపుతూ) చూశావా నాన్నా, ఈ కాలం పిల్లలు!

ప్రసా: సంతోషించాం కాని, నోరుముయ్యి వోయ్.

సూ: (నోరుమూసుకుంటూ) పెద్దవాళ్ళు మాటలు వినడం –

చం: (సూర్యాన్ని అనుకరిస్తూ) బుద్ధిమంతులు లక్షణం.

ప్రసా: (నవ్వుకుంటూ) మీ నాన్న రాగానే కబురు చెయ్యమ్మా! పైన వుంటాను. (విజయ తల వూపుతుంది. ఆయన వెడతాడు. విజయ కూడా ఆయన తాగిన కాఫీగ్లాసు తీసుకుని పెరటివైపు వెడుతుంది)

చం: రామం ఎంత బెట్టుపోతున్నాడురా!

సూ: ఆ! మనంతట మనం కోరాం కదరా! (వనిత తనంత తావలచివచ్చిన చుల్కన గాదె యేరికిన్' అన్నట్లుగా పిలవా పెట్టాకుండా వీడి దగ్గరకు కీర్తి కాంతి వస్తుంటే వీడు వట్టి ప్రవరుడయి కూర్చున్నాడు.

చం: అయినా నిన్నటిదాకా మన నాటకంలో వేస్తానని, ఇంతలో ప్లేటు ఫిరాయించాడేరా?

సూ: ఏముంది? మొన్న టూర్‌లో ఏదో పురుగు తొలిచి వుంటుంది. మళ్ళీ పరిషత్తుకు నాటకం తీసుకు

వెడతాడుట? ఇప్పుడు వ్రాయడానికి కూర్చున్నాడు. మనం నాటకాలాడుతున్నది కీర్తికోసం కాదు, కళకోసం; మన ఆదర్శాలు అందరి ముందు వుండడం కోసంరా – అని. అవన్నీ వదిలి, తను కళ్ళనీళ్ళే కాకుండా, ప్రపంచానివి కూడా సంవత్సరానికి ఒక్కసారే తుడుద్దామనుకుంటున్న ఈ పరిషత్తులో వాడి కెందుకు చెప్పు?

చం: సరే! ఇంతకూ రామ మన నాటకంలో వెయ్యడానికి వప్పుకుంటేనా?

సూ: నీకా భయం అక్కర్లేదు. వాడిచేతి వేయించే భారం నాది.

చం: అచ్చా! అయితే త్వరగా రిహార్సల్సు మొదలుపెట్టాలి. ఇంకా ఆలస్యం చేస్తే మన ప్లానంతా ఉల్టాసీదా అవుతుంది.

సూ: అరె! ఇంతవాళ్ళం ఇక్కడ వున్నాం, అంత పని జరగనిస్తామా?

చం: గుడ్!...అయితే నాటకాన్ని ప్రేక్షకులకు పరిచయం చెయ్.

సూ: అదేమిట్రా! ఇందాక నాటకాన్ని ప్రేక్షకులకు పరిచయం చేద్దాం రా అంటే వాళ్ళకా మాత్రం తెలియదా అన్నావు – ఇప్పుడు –

చం: అదికాదురా! నాటకం సుఖాంతమో, విషాదాంతమో చెప్పకుండా కాని – పేరు వదిలెయ్. (వాటీజ్ ఇన్ ఏ గేమ్' అన్నాడు......ఎవరు?

సూ: ఎవరో తెలిస్తే కాలేజీలో వుండేవాడినిగా! సరే! (గొంతు సవరించుకుని) సోదరీ సోదరులారా! నాటకాలు కేవలం సరదాకోసమో, ప్రచారం కోసమో కాక, సాంఘిక న్యాయాన్ని నిరూపించే నగ్న సత్యాలులు కావాలన్నది నా అభిలాష. జీవిత సత్యాన్ని నిరూపించడానికి నాటకం మూలాధారం. అనేకమందికి తెలియని రహస్యమయిన గొప్పతనం నాటకంలో మరొకటి వుంది. అభ్యుదయ మార్గాన సాంఘిక విప్లవానికి మానవజాతి పురోగమించి, చరిత్రను పునరుద్ధరింపచేయగల శక్తి నాటకానికి మాత్రమే వుంది.

చం: ఈ నాటకాన్ని ప్రేక్షకులకు పరిచయం చెయ్యరా, అంటే నాటకాల్ని గురించి ఉపోద్ఘాతం మొదలుపెట్టావేరా? ఉపోద్ఘాతమేర బంగాళాఖాతం అయింది. ఇక ఆపు.

సూ: నువ్వు పోయి దాన్లో పడితేగాని, దీనికి అంతం ఉండదు. నేను చెప్పిందంతా ప్రత్యక్ష సత్యం. మనలో చాలా మంది కళ్ళు వుండి కూడా చూడలేని దాన్ని నేను చెప్పాను. సంఘం మీద నాటక ప్రభావం ఎంత? దానికి సమాధానమే ఈ నాటకం. ఈ భావాలే నన్నీ నాటకం వ్రాయడానికి పురికొల్పినయ్. ప్రదర్శించడానికి ఉత్తేజపరిచినయ్. అటువంటి అప్పుడు నువ్వన్నట్లుగా నా యీ ఉపోద్ఘాతమే లేకపోతే, నా నాటకం లేదు. నా నాటకం లేకపోతే నేను లేను.

చం: ఇవ్వాళ ప్రొద్దున్నే లేచి ఎవరి మొహం చూశానో కాని, నీ వుపన్యాసాలు వినలేక చస్తున్నాన్రా!

సూ: ఆ చూపిన వాళ్ళెవరో, వాళ్ళదగ్గరకు వెళ్ళి అమాంతం అభినందించి రారా. లేకపోతే ఈ అవకాశం అందరికీ అనుకున్నప్పుడల్లా దొరకుతుందా?

చం: ఇంతకూ నాటకాన్ని గురించి ఏమీ చెప్పవన్నమాట!

సూ: పానకంలో పడకలా అడ్డువచ్చేది నువ్వే, మళ్ళీ చెప్పడం లేదని దెప్పిపొడవడం నువ్వేనా?

చం: ఐతే మనం నోరు తెరవం. నువ్వు చెప్పుకుపో –

సూ: ప్రపంచాన్ని ఒక ప్రమాదంలోనుంచి తప్పించావురా!

నిత్య జీవితంలో నిరంతరం వ్యధతో నిండి, అవతలితీరం కనుపించని అమాయకుడి విషాదాంత గాథ ఇది..చెడు వుంటేనే విషాదదాతం కాన్నక్కరలేదు. ఇది మంచికీ మంచికీ జరిగిన సంఘర్షణ. బలం కలిగింది నిలుస్తుంది.

చం: అబ్బబ్బ! ప్రేక్షకులకు నీ నాటకం గొప్పగా వుంటుంది. సరేలే! ఇహ కథ ఏమిటో చెప్పు.

సూ: చెప్పబోతున్నది అది! భూతభవిష్యద్వర్తమానాల్లో ఎప్పుడో ఒకప్పుడు, ఎక్కడో ఒకచోట, ఎవరో ఒక మనిషి.

చం: ఊ!

సూ: కాశీమజిలీ కథల్లో మాదిరిగా నువ్వు 'ఉ' కొట్టకపోతే కథ సాగదా ఏరా?

చం: కాదురా! లేకపోతే నిద్రవస్తుందేమోనని! (సూర్యానికి కోసం రావడం చూచి) సారీ బ్రదర్....కంటిన్యూ

సూ: ఆయన బంగారు పిచ్చుక. ఆయనకు ఒక్కడే కొడుకు – అందమైనవాడు, చదువకున్నవాడు, బుద్ధిమంతుడు –

చం: నాన్సెన్స్......వాస్తవికత లోపించిందిరా బ్రదర్ –

సూ: ఏం?

చం: ఒకే మనిషి చదువుకున్న వాడైవుండి, బుద్ధి మంతుడు కావడం కేవలం అసహజం....సింప్లీ ఇంపాజిబుల్

సూ: నీబోటి వాళ్ళు వుంటే దేశం యిలా తయారైంది!...ఆ మాత్రం ఊహించలేవురా? ఊహ లేనివాళ్ళను ఉరి తియ్యమన్నాడు షెర్లాక్ హోమ్సు.

చం: వాడు మా వాడేలే. సరదాకి చెప్పివుంటాడు....ఆ, తరువాత.

సూ: అతను తెలివిగలవాడు కూడాను –

చం: ఏం? కొంపతీసి ఎవరినయినా ప్రేమించాడా ఏమిటి?

సూ: అమోఘం...అద్భుతం. నీ అత్యద్భుతమైన ఈ పరిశోధనకు నీకు నోబుల్ బహుమానం యిచ్చినా తక్కువే – నిజంగా అంతే జరిగింది. ఆ అబ్బాయి ఓ అమ్మాయిని ప్రేమిస్తున్నాడు.

చం: సహజమే కదా!

సూ: మనకు సహజం కావచ్చు. వాళ్ళ వాళ్ళకు అది కొండవిరిగి నెత్తిన పడ్డట్లయింది. వాళ్ళిద్దరి మధ్యా ఎంతో దూరం వుంది. ఆ అమ్మాయి అతి సామాన్య. ఆమె వీధిలో ఉంది. అతను పై అంతస్థులో ఉన్నాడు. ఆమెలో అతను తన ఆరాధ్యదేవతకు చూసుకున్నాడు. ఆ అమ్మాయికి కూడా కళ్ళుకిందికి రాలేదు. కాళ్ళు ముందుకు పోలేదు. ఆమె పైకి పోవడానికి తలుపులు వేసి వున్నాయ్. అతను క్రిందికి రావడానికి తెరలు మూసివున్నయ్.

ఆమె నిరాశతో చూసింది. అతను మేలు కొన్నాడు. వాళ్ళ కళ్ళు కదిలినయ్. వాళ్ళ మనసులు కలిసినయ్. వాళ్ళ కాళ్ళు కదలినయ్.

చం: అంటే, కథానాయకుడు మేడమీదినుంచి క్రిందికి దిగివచ్చాడంటావ్. అంతేనా?

సూ: అక్షరాలా!

(అంటూ వుంటగా మేడ దిగి రామమోహన్ వస్తాడు. మనిషి అందగాడే! వయసు ఇరవై మూడు. ఇరవై

నాలుగు వుంటయ్. మనిషి వుల్లాసంగా కనుపించినా, లోపల తీరని వ్యధతో బాధపడుతున్న వాడిలా వుంటాడు)

చం: ఓహో! ఏం కథా సంవిధానంరా! సాక్షాత్తూ కథానాయకుడే పైనుంచి క్రిందికి దిగి వచ్చాడు కదా!

సూ: మరేమనుకున్నావ్! 'రవిగాంచినచో కవిగాంచునే కదా!' అన్నారు. మనం రవి, కవి రెండూ కాబట్టి మనం సర్వజ్ఞాన సంపన్నులం –

చం: కథానాయకుడు వచ్చాడు. బాగానే వుంది. మరి కథానాయిక – ?

సూ: అరె! అంత త్వరపడతావేరా? కథానాయకుడు క్రిందకు వచ్చి తలుపు తీస్తే కదా, ఆమె లోపలకు వచ్చేది? అందువల్ల కొంతసేపు తాళుము కృష్ణా!

చం: నేను కృష్ణుణ్ణి కాదురా, చంద్రుణ్ణి.

సూ: పోనీ తారకోసమైనా కొంచెంసేపు ఆగు.

చం: నేను కథానాయకుణ్ణి కాదు కదరా!

సూ: ఏదో వినాయకుడివి...ఆంధ్రదేశంలో 'విట్' వేస్తే అర్థం చేసుకునే రసజ్ఞుడు మచ్చుకైనా ఒక్కడు లేడు కదా! ఎవరికైనా దీన్లో విశేషం యిదిరా అని చెప్పినా, "ఓస్! ఇంతే! నాకిదివరకే తెలుసున"నే వాడే కాని, సరిగ్గా ఆనందించే వాడొక్కడూ లేడే!

చం: బ్రదర్! నా మాట విని పత్రికలో ఒక ప్రకటన వేయించు. "సునిశితమైన హాస్యాన్ని ఆస్వాదించగలవారికి ఒక అమూల్యమైన అవకాశం...."

సూ: ఇంకా కొంచెంసేపు అట్లాగే వాగుతూ వుండు. ఘాటైన హాస్యమే రుచి చూస్తావు.

చం: పనిలేని మంగలి మాదిరిగా ఏదో ఒకటి చేసి, నీ చేత మాటలు పడడమెందుకు? ఇహను మాట్లాడను – (రామం వైపు చూసి) మనం ఇన్ని మాటలు మాట్లాడినా కథానాయకుడు యిక్కడే వుండి కూడా మాట్లాడ్డేం?

సూ: మౌనవ్రతమేమో?

చం: మొహమాట మేమో?

సూ: మనం మాట్లాడలేదని కోపమేమో?

చం: కావచ్చు

సూ: కథానాయకులకు నాటక నిర్వాహకులకు హృదయపూర్వకాహ్వానంతో కూడిన కృతజ్ఞతాభివందనములు. తమ రెందుచేతనో మౌనం వహించినట్లున్నారు?

చం: ఈ సేవకులపై కరుణ వహించి, మా తప్పులకు మన్నించి, నోరు తెరువ ప్రయత్నం పరా?

రామ: తమరు ముందు నోరు మూసుకోవడానికి ప్రయత్నిస్తారా?

సూ: మరి నాటకం?

రామ: మీరు ఒక పావుగంట ఈ రంగంమీదనుంచి నిష్క్రమిస్తే, నా పని పూర్తి అవుతుంది. అప్పుడు నేనూ మీతో కలుస్తాను. ఒక నాటకం ఏమిటి? ఎన్నైనా వేద్దాం.

చం: ఇదివరకైతే కథానాయికలు ఏకాంతంగా కోపగృహంలోనో, ఎక్కడో ఒక చోట వుండేవాళ్ళు. ఇప్పుడు మగవాళ్ళే ఎందుకు వుంటున్నారో?

సూ: తీరిగ్గా మేడమీద కూర్చుని భగవంతుణ్ణి అడుగుదువుగాని పద – బ్రదర్! నీ సీను పూర్తికాగానే కేకవెయ్. లేకపోతే అనవసరంగా రసభంగం అవుతుంది.

(వెళ్ళిపోతాడు)

(రామమోహన్ చాలాసేపట్నుంచి ఎవరి కోసమో నిరీక్షిస్తున్నట్టు కనబడతాడు. చేసి ప్రయత్నాలు విఫలం కావడం వల్ల నిట్టూర్పు విడుస్తూ, సోఫాలో కూలబడి కళ్ళు మూసుకుంటాడు. ఇంతలో విజయ కాఫీ కప్పుతో సహా వస్తుంది. ఏదో ఆలోచిస్తున్న రామం ఆమె రాకను గుర్తించడు. కాఫీ బల్లమీద పెడుతుంగే చప్పుడవుతుంది)

రామ: ఓ! విజ్జీ!

విజ: ఏమిటి ఆలోచిస్తున్నారు?

రామ: నిన్ను గురించే!

విజ: ఏమని?

రామ: నీకేం శిక్ష విధించాలా అని.

విజ: ఎందుకో?

రామ: ఇంకా ఎదురు ప్రశ్నలు కూడానా? రాత్రనగా వస్తిని. ఇక నేను చస్తున్నానో, బ్రతుకుతున్నానో ఆలోచించే అవసరం కాని, అవకాశం కాని నీకు లేవన్నమాట –

విజ: ముందు కాఫీ తాగండి. తరువాత విచారింతురు గాని నేరస్తుల్ని –

రామ: నువ్వు సమాధానం చెప్పంది నేను తాగను.

విజ: చెబితే అసలు తాగరు.

రామ: అంత చేదు ఏమిటో?

విజ: చెబుతానుగా తాగండి.

రామ: సభవారు హామీ ఇచ్చిన మీదట తీర్మానం వుపసంహరించుకున్నాం. (కాఫీ తాగుతూ వుంటారు)

విజ: మీ నాన్నగారు మిమ్మల్ని గురించే ఆలోచిస్తున్నారు.

రామ: (కాఫీ తీసుకుంటూనే) ఏమనో?

విజ: మీరు బాగుపడేందుకు మార్గం ఏమిటా అని?

రామ: నిన్ను అడిగారా?

విజ: ఒక్క అడగడమేనా? సలహాకూడా సెలవివ్వమన్నారు.

రామ: మరి నువ్వు చెప్పలా?

విజ: ఏమని?

రామ: పెళ్ళిచేస్తే తీరిపోతుందని –

విజ: ఆ మాత్రం సలహా మీరు చెప్పిన తరువాత కదా, నాకు తెలిసింది.

రామ: పోనీలే! చెప్పిన తరువాతనైనా తెలిసింది.

విజ: తెలుగులో చెబుతున్నా తెలియకపోవడానికి చెముడేం లేదుగా!

రామ: అమ్మమ్మ! ఎంతమాట? నిన్నట్లనుటకు సాహసించిన ఆ దురాత్ముడెవ్వరు?

విజ: తమరే?

రామ: నేనా? బేలా! నీకు నన్నపార్థము చేసుకొంటివి.

విజ: ఈ నాటకాలే ఇంతవరకు తెచ్చినయ్.

రామ: ఎంతవరకు?

విజ: (మెడను సూచిస్తూ) ఇంతరకు. (క్షణం ఆగి) ఇట్లా మీరు ఇల్లు పట్టకుండా నాటకాలంటూ తిరగడం మీ నాన్నగారికేమీ బాగాలేదు –

రామ: మా నాన్న గారికి ఇంకా బాగులేని సంగతులు చెప్పనా? నేను ఇట్లా డబ్బు ఖర్చు పెట్టడం –

విజ: ఇన్నీ తెలిసేనన్నమాట!

రామ: చూడు విజ్జీ! ఇవన్నీ నాన్నగారికి దురంతాలు, చెబుబుద్దులు. కాని నా దృష్ట్యా వాటికి చాలా విలువ వుంది. నిజానికి నాకు తెలియదు. ఇట్లా చూడకుండానే ఆయన నాటకాలంటేనూ, నటకులంటేనూ ఎందుకు పనికిమాలిన వాళ్ళన్న కోపం తెచ్చుకోవడంలో ఏమైనా అర్థం వుందా?

విజ: సరే! నాటకాలు వేస్తున్నారు, బాగానే వుంది. కాని, ఇట్లా డబ్బు ఖర్చుపెట్టడం –

రామ: అక్కడే మన అభిప్రాయాలనకు పొంతన కుదరడంలేదు. నాన్నగారికి డబ్బు సంపాదించడంలో ఉన్న ఆనందం తెలుసు. నాకు డబ్బు ఖర్చుపెట్టడంలో ఆనందం తెలుసు. మనిషి ఆర్జించడం మొదలుపెట్టాక చిల్లి కానీ ఖర్చుపెట్టలేదు. అయినా డబ్బు వుండి కూడా ఖర్చు పెట్టనివాడు దేశానికి చేసే ద్రోహం, రాజకీయ నాయకులు కూడా చెయ్యలేరన్నాడు ఓ మహాత్ముడు.

విజ: గొప్ప వేదాంతమే! ఇవన్నీ మీ నాన్న గారి ముందు చెప్పండి.

రామ: ఏం? కొడతారా? కోసుకుతింటారా? మంచిగా, మనకెందుకులే అని వూరుకుంటే వాడు అసమర్ధుడు. కాదు కావాలి అనుకుంటే ఖయాళి..కాని, గౌరవం కోసం చూస్తున్నాను కాని, నేను కూడా అంత పిరికివాణ్ణి కాదని తెలుసుకో – ఇవ్వాళ కాకపోతే, రేపైనా ఆ సంగతి ఋజువు చేస్తాను.

విజ: ఇప్పుడు మాత్రం నాకు తెలియదని చెప్పానా? నలుగురూ ఏమనుకుంటారు? పరిస్థితుల్ని ధైర్యంగా ఎదుర్కొనే శక్తి లేక దానికి ఏదో పేరు పెట్టుకుని సంతృప్తి పడతారన్న మీ మీద వున్న అపోహను మీరు తొలిగించాలనే నేననేది.

రామ: సరే! అందాకా యెందుకు? ఇవ్వాళో, రేపో మన సంగతి నాన్నగారికి ఎలాగూ చెప్పబోతున్నాను కదా! అప్పుడు చూడు –

విజ: (కంగారుగా) అంత తొందరేం చెప్పండి?

రామ: తొందరా? ఇప్పటికే ఆలస్యమయిందని నేను బాధపడుతుంటే – చూడు విజ్జీ! ఈ సంగతి ఎప్పుడో ఒకప్పుడు తెలియవలసిందే కదా! అది ఎంత త్వరగా తేల్చుకుంటే అంతమంచిది. నిన్ను చూడకుండా ఒక్క క్షణం కూడా గడపగలగడం అసంభవం. అందుకే నెలరోజుల్లో వస్తానని చెప్పిన వాణ్ణి, వారం రోజుల కల్లా తిరిగివచ్చాను.

విజ: కాని పెదబాబుగారికీ విషయం మీరు స్వయంగా చెబితే బావుంటుందా?

రామ: మనం సందేహాలకు సమాధానాలు వెతుక్కుంటూ కూర్చుంటే పని జరగదు విజ్జీ......రంగంలోకి దూకుదాం. ఆ తరువాత అటునుంచి నరుక్కురమ్మన్నాడు.

విజ: నిజమేననుకోండి. కాని త్వరపడి మనం ఏం చేసినా ముప్పు కదా అని.

రామ: అంత ప్రమాదం జరగడానికి అవకాశాలు ఏం వున్నయ్! చిన్నప్పటి నుంచీ మాలో, మా మధ్యన పెరిగావ్..చదువూ, సంస్కారం అన్నీ వున్నయ్.

విజ: అన్నీ వుండగా సరా? మీ నాన్నగారికి నచ్చవద్దా?

రామ: పెళ్ళిచేసుకునేది నేనన్న జ్ఞాపకం ఉంచుకో –

విజ: కాని, మీరు మీ నాన్నగారి యిష్టానికి వ్యతిరేకంగా చేసుకుంటారా.

రామ: ఆయన నీ యిష్టాన్ని వ్యతిరేకిస్తే, నేనూ అంతే చేయవలసి వస్తుంది, మరి. అంత ఆపద రాదనుకుంటాను.

విజ: ఒకవేళ వస్తే –

రామ: రానీ విజ్జీ! దీన్లో నేనెందుకు వెనక్కి పోవాలి? నాన్నగారిమీద నాకున్న గౌరవం కూడా నా ఆశయాల్ని నెరవేర్చ లేకపోతే, గత్యంతరం ఒక్కటే వుంది.

విజ: నా మాట విని అటువంటి ఆలోచనలు మాత్రం మానండి. దానివల్ల ఎవ్వరికీ శుభం కలుగక పోగా, అనవసరమైన అపవాదులూ, అనర్థకమైన బాధలూ అనుభవించవలసి వస్తుంది.

రామ: విజ్జీ! నా వుద్దేశ్యం అది కాదు. అనవసరమైన బాధలు కొని తెచ్చుకోవడమౌతుందేమోనని – (ఇంతలో సూర్య, చంద్రులు వస్తారు)

సూ: మీ సీను పూర్తికానిదే ప్రవేశించినందుకు క్షమించండి....కాని ప్రయోక్తగారి ఆజ్ఞప్రకారం వెంటనే కథానాయకుడు వారిని కలుసుకోవాలని వుండడంతో యిలా మీ సంభాషణకు అంతరాయం, రసభంగం కావించవలసి వచ్చింది.

రామ: నీ నాటకాల భాష ఆపి, మనుష్యుల భాష మాట్లాడరా! నాన్నగారు ఎక్కడ?

సూ: అంతఃపురంలో! – ఆ మాత్రం తెలుసుకోలేవా? పైగా ఏమన్నా అంటే నాకు నాటకరంగంలో పదేళ్ళ పరిచయం వుందంటావు! పరిచయం ఎందుకురా? పరిశోధనలు కావాలి గాని – (రామం వెళ్ళబోతాడు)

చం: నీ సీను కాగానే మన నాటకం మొదలు పెడదామన్నావు...జ్ఞాపకం వుందా!

రామ: ఈ సీను పూర్తికానిస్తే కదా!

సూ: క్షమించమని ప్రార్థించిన తర్వాత ఇంకా తప్పుల్ని ఎన్నడం సభ్యత కలవాడు చెయ్యవలసిన పనేనట్రా?

రామ: మన సభ్యతే చెప్పుకోవాలి!

సూ: పోనీలేరా బ్రదర్! చంద్రుడంతటివాడికి మచ్చ తప్పలేదు.

రామ: అందుకే నిన్ను నువ్వు మరగేసి తొడుక్కో –

చం: నువ్వు ధరించిన కొయ్యతుపాకీ పారేయ్.

సూ: అరే చంద్రం! నువ్వు కూడా నా మీదకే వస్తున్నావ్. భావ్యంగా వుందా?

చం: లేదా?

సూ: ఏమీ లేదు.

చం: అయితే విరమించుకున్నాం.

రామ: ఇంకేం? మీ రంగం కానివ్వండి. (విసురుగా వెళ్ళిపోతాడు)

సూ: (వెళ్ళిపోబోతున్న విజయతో) విజయా! బ్రహ్మాండమయిన ఐడియా! ఇంతవరకు ఎవ్వరికీ తట్టలేదు,

ఇకముందు తట్టదు...నువ్వే ఈ నాటకంలో కథానాయికవు ఎందుకు కాకూడదు? ఏం, చంద్రం?

చం: అవును. ఎందుకు కాకూడదు?

విజ: నేనా?

సూ: ఏం, నువ్వే! దేనికి నీ భయం?

విజ: నేనింతవరకు నలుగురితోను మాట్లాడి ఎరుగను.

సూ: ఏ నటుడూ, నటీ కూడా వాళ్ళు మొదటి సారి స్టేజీ ఎక్కకుండానే గొప్పవాళ్ళు కాలేదు. అలాగే ఈ శుభ సమయంలో నాందీగీతం పాడుకునే నీ నటన ప్రపంచ చరిత్రలో నీకొక విశిష్ట స్థానాన్ని సంపాదించి పెట్టగలదేమో ఎవరు చెప్పగలరు?

విజ: ఎవ్వరూ చెప్పలేని మాటయితే నిజమే కాని నాకు మాత్రం ఇష్టం లేదు సూర్యం. కావాలంటే మరేదైనా సహాయం చేసిపెడతాను.

సూ: సరే! ఏం చేస్తాం? నీలాటి నటీనటులను చూచి ఆనందించే భాగ్యం ప్రేక్షకులకు, పరచయం చేసే భాగ్యం నాకూ, నీ ప్రక్కన నటించే భాగ్యం మా అన్నయ్యకు లేకపోయింది కదా –

విజ: అంత మాట లెందుకులే! ఏదో అనామకురాల్ని – (నవ్వుతూ వెళ్ళిపోతుంది)

సూ: ఇంతేరా మన దేశంలో ఆడవాళ్లు. దేనికీ ముందుకు రారు. అన్నింటినీ విమర్శిస్తారు. ఇదే ఏ –

చం: ఆడవాళ్ళమీద నీ వుపన్యాసం అంతటితో ఆపి, నాటకాన్ని కంటిన్యూ చెయ్.

సూ: ఆ! ఎక్కడ వున్నాం?

చం: ఇదేమన్నా పురాణ శ్రవణమా?

సూ: కాదులే! ఎంతవరకు నడిచిందీ అని –

చం: కథానాయకుడు, కథానాయిక కలుసుకున్నారు. ఇద్దరూ సానునయ వాక్యాలు చెప్పుకున్నారు. ఒకరి కోసం ఒకరు ఎంత త్యాగమైనా చేస్తామని బాసచేసుకున్నారు.

సూ: ఆ!..అదే రంగంలో అమ్మాయిని వెతుక్కుంటూ ఆ అమ్మాయి తండ్రి వస్తాడు....తండ్రికి ఎటువంటి వేషం బావుంటుందిరా?

చం: అసలా వేషం ఎవరు వేస్తారు?

సూ: ఎవరు వేస్తేనేరా? కావలసింది పాత్రపోషణకు కావలసిన దుస్తులు....ఉదాహరణకు నువ్వే వేస్తావనుకో–

చం: నన్ను వెయ్యమంటే, నేను ట్విడు సూటు వేసుకువస్తాను.

సూ: నీకున్న ఒక్క ట్వీటు సూటును ప్రేక్షకులు చూడరేమోనని నీ దిగులు. నీవంటి వాడు నాటకం ఏం వేస్తాడురా? మనం ఎమెచూర్ సంఘాలు ముఖ్యంగా ప్రాముఖ్యం ఇవ్వవలసిందే పాత్రపోషణకు కదా! ఆ పాత్రచేతట్వీటు సూటు వేయిస్తావా? ఆ అమ్మాయికి ఆ అబ్బాయికి మధ్య అంతస్థులవారవుందని ఇప్పుడే కదరా చెప్పుకున్నాం. అటువంటి అమ్మాయి తండ్రికి ట్వీటు సూటు వేయించి స్టేజిమీదకు రప్పించేవాడు ఎంత వెధవై వుండాలి!

చం: పెద్దవెధవై వుండాలి.

సూ: అలా మర్యాదగా ఒప్పుకో, బావుంటుంది.

చం: నీ దగ్గర మర్యాద నేర్చుకోవడానికి ట్యూషన్ చెప్పించుకుంటాను కాని, ఇంతకూ ఆ పాత్ర ఎలా వుండాలో

చెప్పు?

సూ: మనిషి పల్లెటూరి వాడు. కాని వాళ్ళ మనస్తత్వానికి సంపూర్ణంగా విరోధి. జీవితంలో సాధన, సంతృప్తి రెండూ వున్నవాడు. (సోఫాలో కూలబడి, కళ్ళుమూసుకుని) ఒక వేషం! నువ్వు చెప్పినదానికి పూర్తిగా వ్యతిరేకం – మోకాటివరకు నీరుకావిధోవతి, ఓ బనీను, తలపాగా, కాళ్ళకు కిర్రుచెప్పులు, చేతులో కర్ర – విశాలమైన వక్షం, పరిశ్రమతో ధృడపడ్డ శరీరం, ఒత్తైన తెల్లటి మీసం, వెనుకటి బాధలను జ్ఞాపకం చేసే విషాదమాదక మైన నవ్వు – (కళ్ళు తెరిచి) ఎలా వుందిరా?

(ఈ వర్ణన మొదలు పెడుతూవుండగానే రంగయ్య వస్తాడు. పల్లెలో వున్న ప్రసాదరావుగారి ఆస్తి అజమాయిషీ అంతా అతనిదే – వయసు యాభై)

రంగ: ఏం సూర్యంబాబూ! నన్ను చూసేనా ఏమిటి, వెక్కిరిస్తున్నావ్?

చం: లేదు రంగయ్యా! ఇది మా నాటకంలో ఓ పాత్ర. సూర్యం! మన నాటకంలో ఆ పాత్ర రంగయ్య చేత వేయిస్తే వాస్తవికతకు మనం చాలా దగ్గర్లో వుంటాం కదూ?

సూ: దేనికైనా అతిపనికి రాదరా! నాటకం సాంఘికమైన సత్యాన్ని నిరూపించవలసిందే! కాని వున్న దాన్ని వున్నట్లు చూపించడం శోభస్కరం మాత్రం కాదు. నాటకం కావ్య గౌరవాన్ని అందుకోవాలంటే, సంఘాన్ని సత్యాన్ని సమమైన మోతాదులో మాత్రమే స్వీకరించాలి. అద్దాన్ని ముఖానికి మరీ దగ్గర వుంచుకొని చూసినదాని కన్న నియమితమైన దూరంనుంచి చూస్తేనే సరియైన ప్రతిబింబం కనిపిస్తుంది.

చం: రంగయ్యా! మంచినీళ్ళు కావాలా?

రంగ: ఏం?

చం: మా వాడి మాటలకు కొంచెం సొమ్మసిల్లినట్లుగా ఉంటేనూ –

సూ: అంతే బ్రదర్! నిజం చెబితే మూర్ఛపోతారు అబద్ధం చెబితే ఆనందిస్తారు....ఆంధ్రుల తత్వమే అంత.

రంగ: నాన్నగారు వున్నారా, బాబూ!

సూ: పైన వున్నారు రంగాయ్య పిలవమంటావా?

రంగ: ఎందుకు బాబూ? నేనే వెడతాను.

(ఇంతలో ప్రసాదరావుగారు వస్తారు)

చం: ఆడబోయిన తీర్థమెదురైనట్లు –

ప్రసా: ఏం రంగాయ్య?

రంగ: నమస్కారం బాబూ!

ప్రసా: కూర్చో!

సూ: మాకు మేడమీద చిన్న బిజినెస్ వుంది వస్తాం.

ప్రసా: ఉద్ధరిస్తావ్.

సూ: తప్పకుండాను. రా, రా బ్రదర్! (వెళ్ళిపోతారు)

ప్రసా: కూర్చో రంగయ్యా! గోపాలం వచ్చాడా?

రంగ: వస్తున్నాడు బాబూ!

ప్రసా: వాడి విషయం మాట్లాడుదామనేనయ్యా! నిన్ను పిలిపించింది. వాడు సీతను పెళ్ళి చేసుకోనంటున్నాడట!

రంగ: అవును బాబూ! ముందు నుంచీ అనుకుంటున్నదే! ఇప్పుడు వీడిట్లా బిగిసి కూర్చున్నాడు.

ప్రసా: మరి? ముందు చేసుకుంటాననడం ఎందుకు? తరువాత మాట తప్పి దాన్ని బాధపెట్టి, తను బాధపడడ మెందుకు? (గోపాలం వస్తాడు) రా, గోపాలం! నీ విషయమే మాట్లాడుతున్నాం.

గోపా: ఏమిటి బాబూ అది?

ప్రసా: నువ్వు సీతకు పెళ్ళిచేసుకుంటానని మాటయిచ్చావు కదూ?

గోపా: ఒకప్పుడు.

ప్రసా: ఎప్పుడయితేనేం? ఇచ్చావు – మరి ఇప్పుడు చేసుకోనంటున్నావ్?

గోపా: అవును.

ప్రసా: ఏం? నిన్నటి దాకా పనికి వచ్చింది ఇవ్వాళ పనికి రాలేదా?

గోపా: నిజంగా అంతే బాబూ!

ప్రసా: ఇదుగో గోపాలం! నువ్వు మా పిల్లతోటి వాడివి. నేను చెప్పినమాట విను. కొంచెం నీకన్న వాళ్ళు తక్కువ స్థితిలో వున్నారనుకో. ఆ కారణంతో ఆ అమ్మాయికి మాట యిచ్చి తప్పడం –

గోపా: ఇందులో ఆ అమ్మాయి స్థితి సంగతి ఏముంది పెదబాబూ?

ప్రసా: మరి నువ్వు అడ్డు చెప్పడానికి కారణం?

గోపా: అవన్నీ ఇప్పుడెందుక బాబూ? ఈ పెళ్లి జరగదు.

ప్రసా: ఏం? నువ్వు ఒప్పుకుంటే ఎందుకు జరగదు?

గోపా: అదే! నేను ఒప్పుకోవడమే జరగదు.

రంగ: మేము అడిగేదీ అదే! 'ఎందుకు' అని?

గోపా: మమతలతో కలుసుకోలేక, కలతలతో విడిపోయిన మనసులు మళ్ళీ కలుసుకోవడం మాటలు కాదు బాబూ!

ప్రసా: నిజమే! కాని ఒక్క మాట చెబుతాను విను. ఆ అమ్మాయి నీ కయిష్టతనే కలిగించిందనుకో. నీకు మనసు వుంది. ఆమెను మన్నించు. నీకు మనసు లేదనుకోవడానికి నువ్వు మనిషివి కాకుండా పోలేదుగా!

గోపా: కాని సర్వస్వాన్ని తనకే అర్పించుకున్న మనిషిని అన్ని విధాలా నిర్లక్ష్యం చేసినప్పుడు మనషి మనిషిగా వుండడం కష్టం. నన్ను అనవసరంగా బాధపెట్టకండి బాబూ!

ప్రసా: ఇదేమీ బావుండలేదు గోపాలం. నువ్వు అడుగైనా ముందుకు కదలకుండా, నువ్వు కావాలనే వస్తువును రమ్మంటే ఎలా వస్తుంది?

గోపా: నాకు కదలడానికి శక్తి లేకనే కదా బాబూ; నాకావస్తువు అసలు అక్కర్లేదంటున్నది.

ప్రసా: నీ మాట నీకు తప్ప కాస్త ఆలోచించవేమోయ్! ఆఖరుసారి చెబుతున్నాను....ఆ అమ్మాయిని పెళ్ళిచేసుకుంటేనే నువ్వు మీ నాన్న తరువాత నా భూములు ఆజమాయిషీ చెయ్యగలవు...లేదా – ఆలోచించుకో.

గోపా: నేను చెయ్యలేని పనులను నాచేత చేయించాలని మీకెందుకీ పట్టుదల చెప్పండి. ఈ విషయంలో ఎవరు ఎన్ని చెప్పినా నా సమాధానం ఒక్కటే –

రంగ: గోపాలం! (వారిస్తాడు)

గోపా: అవును నాన్నా! నేనూ మనిషినే! నాకూ చీమూ, నెత్తురూ వున్నయ్.....మానాభిమానాలు, నీతి నియమాలు మామూలు మనిషిని ఎలా మార్చగలవో, నన్నూ అంతే! క్షమించండి పెదబాబూ! ఈ విషయంలో మాత్రం నన్ను బలవంత పెట్టకండి.

ప్రసా: సరే! ఇంకేం చేస్తాం? విన్నావుకదయ్యా కొడుకు చెప్పిన మాటలు! ఇప్పుడు నేను మాత్రం ఏం చెయ్యగలను? గోపాలం ఒక్కడేనా మాట మీద నిలబడగల మనిషి? నేనూ అంతే –

రంగ: బాబూ!

ప్రసా: అవునయ్యా! జరగవలసిందేదో జరుగుతుంది. అంతే! –

(ప్రసాదరావుగారు వెళ్ళిపోబోతాడు. ఇంతలో సూర్యం, చంద్రం లోపలినుంచి త్వరగా వస్తారు)

సూ: చూడు నాన్నా! అన్నయ్య నాటకమే వద్దంటున్నాడు!

ప్రసా: ఏం నాటకాలురా! ఇహనేం పనిలేదాయేం?

చం: పనంటే యేమిటి? మనం కల్పించుకున్నదే కదా! మాకు ఇదే పని.

ప్రసా: చదువూ, చట్టుబండలూ ఏం అక్కర్లా?

సూ: ఇది మాత్రం చదువుకాదా నాన్నా? కొన్ని వేలమంది ఆడియన్సును కదలకుండా అట్లాగే నోరు తెరిపించి వుంచగలగడం, అనవసరంగా నవ్వించగలగడం, అవసరమైతే ఏడిపించడం – ఇవన్నీ యేమిటి? మా లెక్చరరుగారు వందమందికి పాఠం చెబుతుంటే సగంమంది నిద్రపోయేవాళ్ళు; మిగిలిన సగం నిద్రపోతూన్న వాళ్ళ గురకవల్ల పాఠం వినబడకపోవడం వల్ల, వింటున్నట్లు మాత్రమే నటించేవారు..ఇప్పుడు చెప్పు, ఏది చదువో?

ప్రసా: చచ్చిపోతున్నాం కదరా, నీ వుపన్యాసాలతో?

సూ: ఉపన్యాసాలు వినలేదక తలకాయ నొప్పి వచ్చి బాధలు పడేవాళ్ళను చూశాంగాని, చచ్చిపోయిన వాళ్ళను చూడలేదు.....ఇంతకూ నాటకం మాట ఏం చేశావు నాన్నా?

ప్రసా: ఎట్లాగో ఏడవండి....నాకేమీ తెలియదు.

(అని ఛర్రున వెళ్ళిపోతాడు. రంగయ్య, గోపాలం కూడా దొడ్లోకి వెడతారు. సూర్యం, చంద్రం ఇద్దరూ ఒకరి వంక ఒకరు చూసుకుని, ఏడుపు మొహం పెట్టి, 'ఎలాగో ఏడవడం' మొదలు పెడతారు)

## రెండవ రంగం

సూర్యం, చంద్రం అలా కూర్చునే వుంటారు. కుసుమ వస్తుంది. మనషి అతీనవీనమైన నాగరిక యువతి. మాటా, చేతా కూడా అందుకు అనుగుణంగానే వుంటయ్. భాగ్యవంతుల పిల్ల, చదువుకున్నది, కాస్త అందమయినది కూడాను. ఆమెలో లేని లోపం – సాధారణంగా అలాంటి పిల్లలకుండే గర్వం లేకపోవడం.

కుసు: హల్లో! సూర్యం....మార్నింగ్ చంద్రం....(ఎవ్వరూ మాట్లాడరు) అరె! ఏమిటిది? తరంగములను మా వైపు తరలించకున్న, మే మందరమును బీడు పట్టిన భూములవలె, నీరు లేని లతల వలె, ప్రేమలేని హృదయములవకె మ్రోడైపోమా? అందుకే, మా మీద ఆగ్రహించకుండా, తమ అనుగ్రహాన్ని ప్రసాదించండి

–

సూ: సూర్యచంద్రులు నీ ప్రార్థనను అంగీకరించారు.

చం: నీ తపస్సును మెచ్చారు. ఏం కావాలో కోరుకో –

కుసు: మీరు నా ప్రశ్నలకు సమాధానం చెప్పడమే నాకు కావలసిన వరం.

చం: మేము సిద్ధముగా వుంటిమి. నీ ప్రశ్నలేవి?

కుసు: అవధరింపుడు దేవరలారా! మీ యీ మౌన విషాదవదనములకు కతంబెట్టి?

చం: ఆ ప్రశ్నలకు సమాధానము చెప్పబడదు.

కుసు: ఏమిటి సూర్యం? ఎందుకలా వున్నారు? నిజం చెప్పండి.

సూ: ఏం చెప్పమంటావు కుసుమ? మన నాటకానికి మధ్యలోనే భరతవాక్యం పలికారు.

కుసు: ఏం?

చం: ఏం ఏమిటి? కథానయాకుడే కాదంటున్నాడు.

కుసు: ఎందుకని?

సూ: పైనున్న ఆ భగవంతుడికి తప్ప వాడికి కూడా తెలియదు. నాన్న నాటకాలువేసి చెడిపోతున్నావని కేకలు వేశాడు. అందువ్లల నాన్న ప్రయోక్తగా వుండి వెయ్యబోయే నాటకంలో తను వెయ్యకుండా నాన్న మీద కసితీర్చుకుందామనుకుంటున్నాడు అన్నయ్య.

కుసు: నువ్వనుకొనే ప్రవాదాలన్నిటికీ, ప్రచారాన్ని కల్పించి ప్రమాదాన్ని తీసుకురాకు. మీ అన్నయ్య ఎందుకు వద్దన్నాడో సరిగ్గా తెలియకుండా –

కుసు: నువ్వనుకొనే ప్రవాదాలన్నిటికీ, ప్రచారాన్ని కల్పించి ప్రమాదాన్ని తీసుకురాకు. మీ అన్నయ్య ఎందుకు వద్దన్నాడో సరిగ్గా తెలియకుండా –

చం: అసలు వాడు చెబుతున్న కారణం, వాడి ప్రక్కన వేసే నాయిక లేదని.

సూ: ఓ! గొప్ప ఐడియా! ఆనాడు ఇజాక్ న్యూటన్‌కు వచ్చింది. ఇవ్వాళ మనకు వచ్చింది....కుసుమ! నువ్వే వేస్తేనో ఆ వేషం?

కుసు: నేనా?

సూ: అవును, నువ్వే!

కుసు: నాకు చేతకాదు బాబూ!

సూ: ఇన్సల్ట్! ఇంతమంది హేమాహేమీలం ఇక్కడ వున్నాం. ఇంకా చేతకాదంటావా? నువ్వు 'ఉ' అను, నీకు తయారు తినిపిస్తాం. ఒక అయిదు, ఆరు నెలల్లో. శ్రీమతి – తప్పు తప్పుఉ – కుమారి కుసుమాదేవి ఆంధ్రదేశం గర్వించదగ్గ అగ్రశ్రేణి నటీమణి కాబోతన్నదనడంలో ఆశ్చర్యం అణుమాత్రం కూడా లేదు.

కుసు: నేను వెయ్యను సూర్యం. అమ్మా, నాన్నా వింటే ఇంకేమైనా వుందా?

సూ: చాలా సంతోషిస్తారు. నీకు యిష్టం వున్నదను. మిగిలిన అడ్డంకులన్నింటినీ ఆంజనేయుడు సముద్రం దాటినట్లు, అవలీలగా దాటేస్తాను.

చం: ఇంతకూ కుసుమ సందేహానికి సమాధానం?

సూ: విను మరి – కుసుమాదేవిగారు ఏ నెపంతోనైతే మన యింటికి పంపబడుతున్నారో, ఆ నెపమే దీనికి

సమాధానం చెబుతుంది.

కుసు: అంటే?

సూ: అంటే, ఎవరికోసమైతే మీరు ఈ యింటికి వస్తున్నారో – వారే స్వయంగా ఆహ్మానించారనుకోండి –

చం: అంటే?

సూ: ఇంకా అంటే ఏమిట్రా, అంటే? అంతే! మట్టి బుర్ర –

చం: మట్టిబుర్ర ఏమిట్రా? ఎప్పుడో పట్టేస్తే –

సూ: ఏడిశావ్.....ఏమంటావు కుసుమ?

కుసు: ఏమిటి?

సూ: వేషం వెయ్యడానకిఇ – అభ్యంతరం లేదు కదా!

కుసు: మరి మీ అన్నయ్య –?

సూ: అవన్నీ నాకు వదలమంటివి గదా!

కుసు: సరే!

సూ: థాంక్స్....ఇవ్వాళ ఇంత గొప్ప సమస్యను పరిష్కరించినందుకు నన్ను నేను అభినందించుకోకుండా వుండలేకపోతున్నాను.

చం: నేను?

సూ: ఇంకా నేను అంటావేరా? అమాంతం నన్ను అభినందించక!

చం: (నీరసంగా) అంతేనా?

సూ: ఏడవకురా...ఏడ్చినా మొగుణ్ణి కొట్టిన ఆడవాళ్ళ మాదిరిగి పబ్లిక్‌గా ఏడవకూడదురా – సరే! ఇంతవరకూ ప్రతి విషయంలోను మనం భాగస్వాములం కాబట్టి, దీని బాపతు క్రెడిట్ కూడా నీకు సగం ఇచ్చాను. తీసుకో

కుసు: ఇహ వెడతాను –

చం: ఇంటికా?

సూ: ఆహా– ఇంట్లోకి –

కుసు: ఏయ్ సూర్యం! ఏమిటి ఇందాకటినుంచీ చూస్తున్నాను. మరీ అంత మిడిసిపడుతున్నావ్.

సూ: ఓహోహో! ఎంత సున్నితమైన లోపం? ఈ ఆకారంలో నిన్నున చూసి నీ మాటలు విన్నవాడు ఓ నటకుడైపోయాడు. కాని, అదే ఒక కవి అయితే, నీ మద ఆశువుగా అమాంతంగా ఒక లక్ష పద్యాలు చెప్పి, వాటిని నీకే అంకింతం చేసేవాడు. నీకు జీవితాంతం దాసోహం చేసేవాడు...కాని ఈ నిర్భగ్యుడేం చెయ్యగలడు?

కుసు: తొందరపడకు. నువ్వూ కవిత్తం చెప్పే రోజులు రావూ? రాధ నీ చేత ఎప్పుడు కవిత్వం చెప్పిద్దామా అని చూస్తోంది –

చం: ఏ రాధ? కొంపదీసి –

కుసు: ఆ! మీ క్లాసుమేటు రాధే! అక్కడికే వెడుతున్నాన్లే.....చెప్పొస్తాను.

చం: ఏమనో?

కుసు: ఆ కోతిని పెళ్ళిచేసుకుని చెవులు పట్టుకు సాగదియ్యమని.

సూ: ఇంత పనిగట్టుకునీ అక్కడకు వెడుతున్నావు గనక, ఆ అమ్మాయితో చెప్పు.....కోతులు మరీ పెద్దకోతికి గాని లొంగవని –

కుసు: అదే చెబుతాను. ఆ అమ్మాయి నిన్ను గురించి అడగని క్షణం లేదు.

సూ: వెళ్ళు, వెళ్ళు.....తుమ్మెద కోసం పువ్వు విచ్చుతుందో, పువ్వు కోసం తుమ్మెదే వస్తుందో చూస్తాం.

చం: విష్ యు గుడ్ లక్.

కుసు: అదుగో! – (అంటూ త్వరగా వెళ్ళిపోతుంది. ఇద్దరూ దీర్ఘనిశ్వాసాలు విడిచి, కరచాలనం చేసుకుంటారు)

(రామం వస్తాడు. దేనికోసమో ఆతృతతో ఎదురు చూస్తూ వుంటాడు. మనిషిలోనూ, మాటలోనూ తొందర)

సూ: కంగ్రాట్యులేట్ చెయ్యరా బ్రదర్!

చం: షేక్ – (ఇద్దరూ చేతులు చాస్తారు)

రామ: ఎందుకురా?

సూ: నువ్వు ఇంతవరకు నాటకం వెయ్యడానికి చూపిన అభ్యంతరాలన్నింటినీ అధిగమించి విజయం సాధించాం కనుక –

రామ: సరిగ్గా చెప్పండిరా –

చం: కుమారి కుసుమాదేవిగారు మన నాటకంలో కథానాయికగా వెయ్యడానికి ఒప్పుకుంఇ.

రామ: (నిస్పృహతో, నిట్టూర్చి) ఆ.......(కుర్చీలో కూర్చుంటాడు)

సూ: దీన్లో అంత మూర్ఛ నటించవలసిన దేముందిరా?...నువ్వు ఆనందంతో ఆకాశం అంత ఎత్తున ఎదుగుతావని నేననుకుంటే, అమాంతం క్రిందపడ్డావ్!

రామ: ఆవిడి వేషం వేస్తే మనం నాటకాలు వెయ్యడం ఎందుకురా? చెప్పుల షాపు పెట్టుకోవచ్చు.

సూ: బ్రదర్! నీ అభ్యంతరాలు నాకర్థం కావడం లేదు. నాటకాలు వెయ్యడానికి సంస్కారవంతులైన 'ఫామిలీ లేడీస్' రావాలని ప్రపంచమంతా ఘోషిస్తూవుంది. నాటక కళారాధనలో నటరాజును మనం మరో వినూత్నమైన పుష్పంతో పూజిస్తున్నామని గర్వపడక, ఉసూరుమంటావ్?

రామ: నీ వుపన్యాసం కట్టిబెట్టి, కాసేపు అవతలకు పో –

చం: (సూర్యంతో) రామానికి ఈ రంగంలో పనివుంది కాబోలు రా!

రామ: ఆ! వుంది.

చం: ఆ పని యేమిటో ఈ భృత్యులకు కూడా చెప్పి పుణ్యం కట్టుకుందురూ!

రామ: నాకు పుణ్యం అక్కర్లేదు నడవండి.

సూ: మరి నాటకం వేస్తావని వాగ్దానం చెయ్యి.

రామ: అట్లాగేరా నాయనా! ఇహనైనా వెధవ వేషాలు వెయ్యక బయటకు నడవండి.

చం: మనం వేసేవి మంచి వేషాలయినట్టు!

సూ: వాడికేరా? జానపద నాటకాల్లోను, పౌరాణిక నాటకాల్లోను వాడు యువరాజు; సాంఘికాల్లో అయితే ఓ భాగ్యవంతుడి ముద్దు బిడ్డ. ఎక్కడకు వెళ్లినా ఆదరసత్కారాలు, ఏ పని చేసినా పొగడ్తలు – తనను ప్రేమించి తనకోసం ప్రాణాన్ని సయితం యివ్వగల ప్రియరాండ్రు –

చం: అబ్బ! గ్రాంథికంలో చంపకురా – ప్రియురాళ్ళు అను.

సూ: ఏ రాళ్ళయితేనేం వీడి పళ్ళు వూడడానికి? చిట్టి తండ్రి వీడికేరా, మహరాజు బిడ్డ.

(రామం ఎవరికోసమో చూస్తూ, చిరాకు పడతాడు)

చం: ఎవరికోసమో మీ నిరీక్షణ?

సూ: ఎవరికోసమో ఎందుకురా? ఏ రాజకుమారి కోసమో! ఎన్ని కోటగోడలు ఎగబ్రాకాలో, ఎన్ని అంతస్థులు ఎక్కాలో, ఎందిరతో యుద్ధాలు చెయ్యాలో – (రామానికి కోపం వచ్చిందని తెలుసుకుని) నిజం చెబితేనిష్ఠూరం లేరా బ్రదర్! అయినా మా కెందుకు? వస్తాం.....

చం: (వెడుతూ) గుడ్ లక్......(వెడతారు)

(ఓ క్షణం నిశ్శబ్దం....నిశ్శబ్దాన్ని భరించలేని వాడిలా కొంచెం సేపు చిరాకుగా అటూ ఇటూ తిరిగి, చివరకు లోపలకు చూచి, చాలా రహస్యంగా పిలుస్తాడు?

రామ: విజయా! విజయా!!

(విజయ వస్తుంది. మానసికంగానూ, శారీరకంగాను కూడా శ్రమించిన మనిషిలా వుంది)

రామ: చివరకు ఆడవాళ్ళనుంచి సానుభూతి కరువైంది మాకు.

విజ: కరువైంది సానుభూతి కాదు. మా సానుభూతి తిని అర్థం చేసుకొనే హృదయాలు లేక పోవడం.

రామ: అర్థం చేసుకున్న హృదయాల ఆరాటం మీరు తగ్గించారు కాబోలు! చరిత్రలో ఎంతమంది –

విజ: చరిత్ర సంగతి చెప్పకండి...గతంలో మన గొప్పల్ని చూసి మాత్రమే బ్రతకడం మాకు చేతకాదు.

రామ: పోనీ ఈ రోజుల్లో చూడు....నీ కోసం నేను ఎంతగా బాధపడుతున్నానో నీకు తెలుసు. తెలిసి కూడా ఈ సంగతి నాన్నతో చెప్పడానికి నువ్వు ఎందుకు సుముఖంగా లేవో చెప్పు.

విజ: నాకు మాత్రం ఇలా వుంటే సుఖంగా వుందా చెప్పండి. మీ నాన్నగారు చెప్పే మాటలను బట్టి మన జీవితాల మనుగడ వుంటుందని మనం జ్ఞాపకం వుంచుకోవాలి?

రామ: ఏమటి విజ్జీ, నువ్వనేది? ఆయన ఇష్టపడనంత మాత్రాన నా అభిప్రాయాన్ని మార్చుకుంటానంటావ్?

విజ: నేనన్నానా? కాని ముందే పోట్లాటలతో బయలు దేరిడమెందుకు?

రామ: పోట్లాటలతో బయలుదేరడం నాకూ యిష్టం లేదు విజ్జీ. కాని నా అభిప్రాయాలతో ఆయన ఏకీ భవించ లేకపోతే అందుకు నేను కాదు బాధ్యుణ్ణి.

విజ: మీరు మాత్రం తొందరపడకండి.

రామ: తొందరా! ఇంత దగ్గరగా వుంటున్నా, ఈ ఇంట్లోనే దూరంగా నిన్ను చూచి నీ దగ్గరకు రాకుండా నన్ను నేను నిగ్రహించుకోమంటావ్? ఇన్నాళ్ళు చూపించిన ఓర్పు చాలు.....ఇహ –

విజ: (నోటి కడ్డంగా చెయివుంచి, వారిస్తూ) అదే! మీ యీ తొందర మనకు ఎప్పుడే ప్రమాదం తీసుకువస్తుందో నని భయం.

రామ: భయం ఏమీ అక్కర్లేదు.......(విజయను దగ్గరకు తీసుకుని) నాన్నగారిని ఇంటికి రానీ, ఈ పూట తప్పకుండా చెబుతాను.

(ఇంతలో ప్రసాదరావు వస్తాడు. రామం చివరి మాట ఆయన విన్నాడు. వాళ్ళిద్దర్నీ అలా చూడగానే ఆయనకు కోపం వచ్చిన మాట నిజమే, కాని చాలా నిగ్రహించుకున్నాడు. ఆయనను చూసి ఇద్దరూ భయపడి,

దూరంగా జరుగుతారు. విజయం పాలిపోయింది. ఆమె మొహంలో నెత్తురు చుక్క లేదు. రామమోహన్ కూడా ముందు జంకినా, తరువాత ఓ నిశ్చయానికి వస్తాడు)

ప్రసా: నువు వెళ్ళమ్మా – (విజయ వెళ్ళడానికి సంకోచిస్తుంది) వెళ్ళ విజయా, మేం కొంచెం మాట్లాడుకోవాలి. (వెడుతుంది. ఓ క్షణం ఆగి) ఏమిటిదంతా? (రామం మాట్లాడడు)

ప్రసా: నిన్నే ఏమిటిది?

రామ: నేను విజయను ప్రేమిస్తున్నాను.

ప్రసా: ప్రేమించు. దానికేం?

రామ: పెళ్ళిచేసుకుంటాను.

ప్రసా: అబ్బా! అంతవరకూ వచ్చిందా? ఎన్నాళ్ళు నుంచీ ఆడుతున్నారు ఈ నాటకం? మొన్న వేసంకాలం సెలవులకు పల్లెకు వెళ్ళింది దీనికోసమేనన్న మాట.... స్టేజీమీదనే కాక జీవితంలో కూడా నాటకాలు ఆడుతున్నావన్నమాట!

రామ: ఎగతాళి కాదు నాన్నా....నిజంగా చెబుతున్నాను.

ప్రసా: అంటే, విజయను నేను పెళ్ళిచేసుకుంటాను, నమ్మమంటావ్?

రామ: ఏం? నమ్మకుండా వుండవలసిన ఆగత్యం దానిలో ఏం లేదే?

ప్రసా: చాలా వుంది?

రామ: ఏమిటది?

ప్రసా: నేను ఒప్పుకోను కనుక –

రామ: దీనికి అభ్యంతరం ఏమిటి చెప్పండి...నేను విజయను పూర్తిగా అర్థం చేసుకున్నాను. ఆమె కూడా అంతే –

ప్రసా: ప్రేమించుకొని పెళ్ళిచేసుకుంటున్నామనుకొనే యువతీయువకులందరూ అదే సమాధానం చెబుతారు. కాని వాళ్ళ జీవితం తప్పులతో మొదలైకాని, మామూలు మార్గాన పడదు.

రామ: పోనీ, నన్నూ ఆ మార్గాన్నే నడవనివ్వండి?

ప్రసా: అది ముళ్ళున్న మార్గం.....నాకు తెలిసివుండి కూడా నిన్నెలా పోనిస్తాను?

రామ: అంటే, మీరు ఈ పెళ్ళికి ఒప్పుకోనంటారు!

ప్రసా: పెళ్ళంటే దబాయింపు కాదోయ్. నువ్వు ఇప్పుడీ పెళ్ళిచేసుకోవడానికి ఇప్పుడు నీకున్న అర్హత యేమిటి? నువ్వు మగాడివి, విజయ ఆడది కావడమేనా? కాని సంపాదించడం చేతకాదు, పైగా ఇంటినుంచి వందలకు వందలు తీసుకువెళ్ళి, నాటకాల పేరుతో నాశనం చేస్తావ్! ఇదేనా నీ ఘనత?

రామ: ఇవ్వాళ వుంది కాబట్టి ఖర్చు పెడుతున్నాం. రేపు లేకపోయినా ఇలాగే ఖర్చు పెట్టాలనుకున్నవాడు మూర్ఖుడై వుండాలి.

ప్రసా: వాడెవడైతేనేం? నువ్వు మాత్రం అది కాకుండా చూసుకో!

రామ: ఆ భయం మీకక్కరలేదు. నన్ను నేను పోషించుకోగల స్తోమత, పోషించుకోగల నన్న ధైర్యం నాకున్నాయ్.

ప్రసా: నిన్ను గురించి నువ్వు అంతగా భ్రమపడకు. చాలామంది తమను గురించి గొప్పగా వూహించుకొనే, తమ జీవితాన్ని నాశనం చేసుకుంటారు...సరే! అవన్నీ ఎందుకు? నువ్వు విజయనే పెళ్ళిచేసుకోవడానికి

స్థిరపరుచుకున్నానంటావ్! (రామం తల తిప్పుతాడు) నాకు యిష్టంలేకపోయినా?

రామ: ఎందువల్ల చెప్పండి.....విజయం చిన్నప్పటి నుంచీ ఇక్కడే పెరిగింది. నాతోపాటు చదివింది. ఆ మాటకొస్తే నాకంటే ఎక్కువ చదివింది....చదువూ, చక్కదనం; సంస్కారం, ఇన్నీవున్న మనిషిలో లోపమేమిటో నా కర్థం కావడం లేదు.

ప్రసా: నీకు తెలిసింది అంతవరకే – కాని అంతకుమించినవి అనేకం ఈ వివాహానికి అభ్యంతరం కాగలవని నీకు తెలియదు...ఇన్నీ ఆలోచించావుగాని, మీ యిద్దరిమధ్య నున్న అంతస్థుల సంగతి ఆలోచించావా?

రామ: అదే అభ్యంతరమైతే, దాన్ని నేను నిరభ్యంతరంగా అధిగమిస్తాను.

ప్రసా: అంటే, అది నీకు స్వల్పమైన అభ్యంతరంగా కనిపిస్తున్నదన్నమాట!

రామ: అసలు నాకది అభ్యంతరంగానే కనిపించడం లేదు. ఊహలతో గోడలను నిర్మించుకొని అవతల వున్న మనిషి మనిషి కాదనడం వివేకం కాదు.

ప్రసా: తరతరాలనుంచి శ్రమించి నిర్మించిన ఈ అంతస్థులను ఇవ్వాళ నీ ఒక్కమాటవల్ల నాశనం చెయ్యదలచుకుంటే, నువ్వు బికారిగా మాత్రమే మిగుల్తావు.

రామ: నాకాభయం ఎప్పుడూ లేదు.

ప్రసా: అదుగో! ప్రతిదానికీ అడ్డు చెబుతావు, నీ సంగతే నీదికాని ఎదుటివాళ్ళ సంగతి పట్టదేం! ఆ జడ్జీగారు వాళ్ళ అమ్మాయిని చేసుకోమంటున్నారు. మనకంతకన్న మంచి సంబంధాలు రావు......నా మాట కాదనక, ఆ అమ్మాయిని చేసుకో –

రామ: ఆ అమ్మాయినా? ఆ నడక, ఆ మాట – దేవ లోకంనుంచి దిగివచ్చిన అప్సరస ఏమీ కాదావిడ –

ప్రసా: కాకపోవచ్చు. కాని అయిదంస్థుల మేడమీద నుంచి దిగివస్తుంది.

రామ: అంతస్థులు నిర్మించడం. వాటిని గురించి గొప్పలు చెప్పుకోవడమే పనిగా పెట్టుకున్న వాళ్ళు నాతో ప్రయాణం చెయ్యలేరు. నేలమీద, నాతోబాటు నడువగలిగిన వాళ్ళెవరైనా నాకు చాలు.

ప్రసా: ఈ ఇంట్లో ఇంత చదువు ఇచ్చాను. కన్న కూతురుగా చూసుకున్నందుకు ఆ అమ్మాయి చేసేపని ఇదేనా?

రామ: ఇందులో ఆ అమ్మాయి చేసిందేముంది నాన్నా? అయినా ఆమెను మనషిని చేద్దామని తీసుకువచ్చి, తీరా మనిషి తయారైన తర్వాత ఆనందించవలసిందిపోయి, కోపగిస్తారా?

ప్రసా: ఇంకా నయం. నేను కాబట్టి ఇంత జరిగిన తర్వాత మాట్లాడకుండా వూరుకుంటున్నాను. అయినా ఇన్నాళ్ళు పెంచి పెద్ద చేసిన తండ్రికి నువ్విచ్చే ప్రతిఫలం ఇదన్నమాట!

రామ: అందుకు నేను సర్వదా కృతజ్ఞుణ్ణి. కాని నేను ఆమెకు వాగ్దానం చేశాను.

ప్రసా: ఈ వాగ్దానాల దేముంది? మనం చేశామనుకుంటే వుంటయ్, లేకపోతే లేదు.

రామ: అలా అనకండి నాన్నా! నేను మాట ఇచ్చిమాత్రం మనసు మార్చుకోలేను.

ప్రసా: నేను పట్లిన కుందేటికి మూడే కాళ్ళని పోట్లాడ్డం మూర్ఖుడు చెయ్యవలసిన పని. నేనూ జడ్జీగారికి వాగ్దానం చేశాను. కొడుకుగా నా వాగ్దానాన్ని బలపరుస్తావో, ప్రియుడుగా ఆమె వాగ్దానాన్నే మన్నిస్తావో ఆలోచించుకో –

రామ: నేను వెళ్ళి జడ్జీగారిని క్షమాపణ వేడుకుంటాను...కుసుమను ఒప్పిస్తాను.

ప్రసా: నా కోసం ఒకళ్ళ దగ్గరకు వెళ్ళి వేడుకోవలసిన ఆగత్యం లేదు. నీ వాగ్దానం కోసం మంకు పట్టు పట్టి నువ్వు విడవకపోతే, నా వాగ్దానం చెల్లించుకోవడానికి నేనూ అంతే పట్టుపట్టవలసి వస్తుంది.

రామ: అంటే, నేను విజయను పెళ్ళిచేసుకోకుండా చేస్తానంటారు. అంతేనా?

ప్రసా: నా మాటలకు లేని అర్థాలు ఆపాదించకు. వాటికి ఎంతవరకు అర్థంవుందో అంతవరకే తీసుకో! – అయినా కుసుమకు ఏం తక్కువ? చదువు లేదా? సంస్కారం లేదా? అందం లేదా? అంతస్థు లేదా?

రామ: అవన్నీ విజయలో మాత్రం లేవా. మీరు పై అంతస్థున వుంటూ, 'ఆ ఎత్తున వున్నవాళ్లను మాత్రమే చూస్తాను, క్రిందవున్న వాళ్లను చూడను' అంటే మీ అభిప్రాయాలతో నేను ఏకీభవించలేను.

ప్రసా: అంటే, కుసుమను పెళ్ళిచేసుకోవడం నీ కిష్టం లేదన్నమాట!

రామ: అవును.

ప్రసా: సరే! నా ఆస్థిలో ఒక్క చిల్లిగవ్వ కూడా నీకు దక్కడం నాకు ఇష్టం లేదు. నీ యిష్టం వచ్చినట్లు వూరేగు. (వెళ్లిపోతాడు)

(రామం బాధతో కుర్చీలో కూర్చుంటాడు. ఒక నిమిషం ఆలోచించి, ఏదో నిశ్చయానికి వచ్చినట్లు తలపంకించి, విజయను పిలవడానికి లేస్తాడు ఇంతలో కుసుమ వస్తుంది. మనసులో ముందుకుపోదామన్న ఊహ తరుముకు వస్తుంది)

కుసు: హల్లో! రామం! గుడ్ మార్నింగ్.........

రామ: (డీలాపడిపోతాడు) మార్నింగ&...కులాసానా?

కుసు: ఏదో – వున్నాం....నువ్వు మద్రాసునుంచి వచ్చిన తరువాత ప్రతి పూటా నీ కోసం ఎదురుచూడడమే! మొన్న సాయంకాలం వస్తానని డాడీతో చెప్పావట. ఎంత 'డిజప్పాయింట' చేశావ్? నిన్ను నేను కాబట్టి క్షమించను. మరొకరైతేనా?

రామ: థాంక్స్.....ఆ మాత్రం దయ మా మీద వుంది. అంతే చాలు.

కుసు: అది దయ అనకు రామం.....నా కది చాలా సరదా!

రామ: ఏమిటది? నేను తప్పులు చెయ్యడమా!

కుసు: అవును. మగవాళ్ళు తప్పులు చేసి తప్పించుకోవడానికి చూస్తే ఎంత తమాషాగా వుంటారని! వాళ్ళంటే నాకు సరదా.

రామ: ఇదేదో కొత్తరకం సరదా....సరే! నాన్నగారు కులాసానా?

కుసు: ఆ! నువ్వు వస్తావని ప్రతి పూటా ఎదురు చూస్తున్నారు.

రామ: అరెరె! ఎంతమాట! కాకితో కబురంపితే, రెక్కలు కట్టుకుని వాలేవాణ్ణి –

కుసు: అలా అనడం బాగలేదు రామం. నీకున్న గౌరవం, డిగ్నిటీ నీది. డాడీకి వుంది డాడీది –

రామ: నువ్వు చెప్పు డిగ్నిటీ మనుషుల్లో వుంది కాని, మనసుల్లో లేదు. మాటల్లో వుంది కాని చేతల్లో లేదు. అటువంటి డిగ్నిటీ పేరు చెబితేనే నాకు జ్వరం వస్తుంది.

కుసు: వస్తే, నేను నయం చేస్తాను.

రామ: నీవంటి వాళ్ళు డాక్టర్లు కాలేరు. కుసుమా! అయినా, వస్తే నయంచేద్దామనుకొనే కన్న అసలు రాకుండా చెయ్యడం మంచిది కాదూ?

కుసు: ఏం చెయ్యాలంటావ్?

రామ: అదుగో, ఆ నీతివచనాలు పలకకపోవడమే!

కుసు: ఆల్‌రైట్.....నువ్వేం చెయ్యమంటే అదే చేస్తాను (ముళ్ళమీద వున్నట్లుగా వుంటారు) థాంక్స్, అన్నట్టు, నవ్వు పనివుండి వచ్చినట్లున్నావ్. విజయ యింట్లో లేదా?

కుసు: ఏమో - కాని, ఇవ్వాళ నీకో గొప్ప సంగతి చెబుతాను.

రామ: (నీరసంగా) ఊ......

కుసు: నువ్వు విని ఎంత ఆశ్చర్యపడతావో తెలుసా?

రామ: నువ్వు చెప్పిన ఏ విషయం ఆశ్చర్యంగా లేదు? .......చెప్పు.

కుసు: నేను ఇందాక ఇక్కడకు రాగానే సూర్యం అడిగాడు - నువ్వు రామం పక్కన నాటకంలో వేస్తావా అని.. నేను వెంటనే ఒప్పేసుకున్నాను. నేను వెయ్యగలనా?

రామ: ఆ!

కుసు: నిజంగా!

రామ: ఏమిటది?

కుసు: అదే! నేను బాగా వెయ్యగలనా?

రామ: ఏమిటి?

కుసు: శ్రీరామచంద్రా! ఇందాకటినుంచి చెప్పిందంతా పోయింది. నీ ధ్యాస ఇక్కడేమీ వున్నట్లు లేదు - నేను నీతోబాటు నాటకంలో వేద్దాం అనుకుంటున్నాను...వెయ్యగలనా?

రామ: అదా!...ఏమో, నేనేం చెప్పగలను? జీవిత నాటకాల్లో బాగా నటించగలవారు స్టేజీమీద అంతగా రాణించలేరు అంటారు.

కుసు: నువ్వు డైరక్టు చేఇనా -

రామ: దర్శకుడిదేముంది? మెరుగులు దిద్దగలడు కాని సృష్టించలేడుకదా! ఆర్టిస్టు పుట్టాలి కాని, తయారుకాలే డన్నారు -

కుసు: అయినా నేను వేస్తాను రాం. నాకు చాలా సరదాగా వుంది.

రామ: మనిషి ప్రాథమిక హక్కులకు నిలబెట్టుకొనే ఆస్కారం లేదు. ఇహ సరదాలు తీర్చుకుంటానంటావ్?

కుసు: నీకు యిష్టం లేదనుకుంటాను - అయినా చెప్పు - నువ్వు వద్దంటే మానేస్తాను.

రామ: వద్దని చెప్పడానికి నేనెవర్ని కుసుమా! నీ యిష్టం -

కుసు: థాంక్స్.....

రామ: సరే!...నేను కొంచెంసేపు రాసుకుంటాను.

కుసు: మేం చూడకూడదు కాబోలు! ప్రేమలేఖలా ఏం?

రామ: కాకూడదా?

కుసు: అబ్బే! తమాషాకు అడిగాను - సరే, రాసుకో - ఇంట్లోకి వెడతాను.

రామ: గుడ్ బై -

కుసు: అప్పుడే గుడ్ బై కొట్టకండి సార్......వెళ్ళేటప్పుడు మీ దర్శనం చేసుకోకుండా వెడతానా?

(వయ్యారంగా వెళ్ళిపోతుంది. రామం దీర్ఘమైన విశ్వాసం వదిలి చుట్టూ చూస్తాడు. మధ్య గదిలోనుంచి విజయ వస్తుంది)

రామ: (సంతోషంతో, దగ్గరగా వచ్చి) విజ్జీ! ఇప్పుడా రావడం! (అవునని తల వూపుతుంది) గంటసేపట్నుంచి నీ కోసం ఎదురు చూస్తున్నాను. ఇంతలో పానకంలో పుడకలా ఆ కుసుమాదేవిగారు దాపురించింది.

విజ: ఆవిడ నేమీ అనకండి.....ఎంతైనా మీకు కాబోయే ఇల్లాలు!

రామ: ఇల్లాలా! భేష్....విజ్జీ! నువ్వు రామాన్ని అర్థంచేసుకున్నది అంతవరకే నన్నమాట! నేను నా జీవితాన్ని ఎంత నిర్లక్ష్యంగా చూసుకున్నా, మరొకళ్ళ కిచ్చినమాటను మాత్రం నిర్లక్ష్యంగా చూడలేను.

విజ: అలా అని, పరిస్థితుల నెంతకాలం ఎందిరించగలరు, చెప్పండి.

రామ: అవి స్వాధీనమయేటంత వరకు – మధ్యలోనే జారిపోయేటంత బలహీనుణ్ని కాదు.

విజ: పరిస్థితులంటే ఏమనుకుంటున్నారు? తల్లిదండ్రుల్ని, ఆస్తిపాస్తుల్ని – అన్నింటినీ వదలాలి – వద్దు. అంతదూరం రానివ్వకండి.

రామ: ఏమిటి విజ్జీ నువ్వంటున్నది? అర్థం లేకుండా వాళ్ళు అడ్డుపుల్లలు వేస్తుంటే, మన జీవితాల్ని నాశనం చేసుకుందామంటావ్! విజ్జీ! నిన్ను వదలి నేను వుండగలనా, చెప్పు.

విజ: పోనివ్వండి. అనామకురాలిని. నాదే ముంది? నా కోసం మీ రింత బాధ పడుతున్నారు! –

రామ: అసలే నాకు మనసేమీ బాగులేదు. నన్ను ఇంకా బాధపెట్టదలుచుకుంటే అవన్నీ చెప్పు –

విజ: క్షమించండి – ఇప్పుడేం చెయ్యగలం?

రామ: ఇంకా ప్రశ్నల దగ్గరే వుంటే ఎలా? నువ్వు సిద్ధంగా వుండు. మరోగంటలో ఇక్కడి నుంచి మన ప్రయాణం –

విజ: ఎక్కడకిఇ?

రామ: ముందు మన వూరు...ఆ తరువాత ఎక్కడో ఒక చోట వుద్యోగం చూసుకోవడం –

విజ: అంత త్యాగం చేస్తున్నారు...నా కోసం –

రామ: అదుగో! నీ కోసమనే ఎందుకనుకోవాలి? నా కోసం మాత్రం కాదా? నువ్వు లేకుండా నేను లేను. ఇప్పటికే నా నావ, దారీ డొంకా లేకుండా అడ్డదిడ్డంగా నడుస్తోంది. నువ్వు చుక్కాని పట్టకపోతే అది వెళ్ళి ఏ పర్వతానికో కొట్టుకోవడం, ఏ ముక్కకాముక్క విరిగిపోవడం తప్పదు.

విజ: (దుఃఖాన్ని ఆపుకోలేక తన చేతులతో ముఖాన్ని దాచుకుంటుంది) రామం! (రామం ఓదార్పుగా ఆమె బుజం మీద చేయివేస్తాడు)

రామ: భయపడకు విజయా! నేను ఎప్పుడూ నీ వాణ్ణే!

(ఇంతలో ప్రసాదరావుగారు వస్తారు)

ప్రసా: నేనెప్పుడూ రాకూడని సమయాల్లోనే వస్తున్నాను. క్షమించండి. విజయా! నీతో మాట్లాడాలి. (ఎవ్వరూ మాట్టాడరు) రామ! నేను విజయతో మాట్లాడాలి.

రామ: నేనూ వుంటాను

ప్రసా: విజయతో మాట్లాడాలంటే నువ్వూ వుండాలన్న అర్థం కాదు.

(తండ్రి వంక తీక్షణంగా చూసి రామం వెళ్ళిపోతాడు)

ప్రసా: కూర్చో. (విజయ కూర్చోదు) కూర్చోవమ్మా, ఫరవాలేదు. (కూర్చుంటుంది) పుత్రభిక్ష కోసం నీ దగ్గరకు వచ్చాను.

విజ: (బాధపడి) బాబుగారూ!

ప్రసా: అవునమ్మా! నిన్ను చిన్నప్పటినుంచి కూతురులా పెంచాను. ఆ మాత్రం అడిగే హక్కు నాకు వున్నది కదూ! (మాట్లాడదు) నాకు కూతుకే వుంటే నా మాట కాదనదు. నువ్వూ నా కూతురికంటే ఎక్కువైన దానివి. ఏమంటావ్?

విజ: నన్నేం చెయ్యమంటారు?

ప్రసా: అదుగో! నువ్వు అంత బాధతో అడిగితే నాకే బావుండదు. చూడమ్మా! నా ఆశలన్నీ వాడిమీద వున్నయ్. వాడు ఎంత ఎదురుతిరిగినా, చివరకైనా నమా  మాట కాదనడని నా నమ్మకం. ఆ ఆశతోనే నేను బ్రతుకుతున్నాను. ఇప్పుడుర నీ వల్ల వాడి భవిష్యత్తుకు అణుమాత్రం అంతరాయం వచ్చినా నువ్వు సహించగలవా?..నాకది సంతోషదాయకమా? (మాట్లాడదు) నేను జడ్జీగారికి మాట ఇచ్చాను. ఎందుకు ఇచ్చావని రామం అడిగాడు. అదీ నిజమే! కాని నిన్ను ఈ యింటికి  తీసుకు వచ్చేటప్పుడు కూతురుగా తెచ్చుకున్నాను కాని, కోడలుగా తీసుకురాలేదు. అలాగే జరిగివుంటే, ఇప్పుడు ఎవ్వరికీ మాట ఇవ్వవలసిన అవసరం ఉండేది కాదు –

విజ: ఇప్పుడు మాత్రం –

ప్రసా: ఆ మాట నువ్వు అనవసింది కాదమ్మా! మాటకంటె మనిషే ఎక్కువని నాకు తెలుసు. ఆ మాటకు వస్తే, కుసుమకంటె నువ్వే నాకు ఎన్నో రెట్లు ఎక్కువ ఆ మాత్రం నన్ను అర్థం చేసుకోలేవా?

విజ: అది కాదు బాబు! ఆయన మరీ త్వరపడుతున్నారు.

ప్రసా: ఏమంటాడు? (విజయ జవాబు చెప్పదు) చెప్పమ్మా! నాకు తెలియకూడదా!

విజ: మరోగంటలో ఇక్కడినుంచి వెళ్ళిపోవాలన్నారు.

ప్రసా: నాకు తెలుసనమ్మా వాడిపంతం. అది నెగ్గే వరకూ వాడికి నిద్రపట్టదు. కాని ఇది నా విషయం కాదమ్మా! కేవలం వాడికి సంబంధించినది. వాడి అభ్యుదయాన్ని కాంక్షిస్తే, నేను చెప్పినట్లు చెయ్ లేకపోతే, వాడు జీవితంలో ఎదుర్కొనే ప్రతి ఆటంకమూ నువ్వు కల్పించినదేనని జ్ఞాపకం వుంచుకో –

విజ: నన్ను పెళ్ళి చేసుకోవడమే వారి జీవితానికి ఆటంకమంటారా?

ప్రసా: ఆలోచించమ్మా! కుసుమను పెళ్ళిచేసుకోవడం వల్ల వాడికి సంఘంలో పెరిగే అంతస్థు, దానివల్లన వాడికి జీవితంలో కలిగే లాభం –

విజ: (గాద్గదికంగా) బాబూ! నేను ఆయనను వదిలి ఒక్క క్షణం వుండలేను.

ప్రసా: (తన్ను తాను సంబాళించుకుని) నాకు మాత్రం తెలియదా అమ్మా! వాడి పరిస్థితి కూడా అలాగే వుంది. కాని నేనేం చెయ్యగలనో చెప్పు....వాడి బాగుకు పరిస్థితులనైతే కల్పించగలను కాని, ఆటంకాలను నెట్టుకుని ముందుక రాలేను కదా! జడ్జీ గారికి నే నిచ్చిన మాటంటావ్! మాట తప్పడం వల్ల అవమానం ఏదైనా వస్తే నాకు! కాని వాడికేమీ లేదు. ఇది ఒక్కటే అడ్డుకాదు. ఈ పెళ్ళివల్ల వాడు అడుగడుగునా పొందవలసిన అవమానాలు, ఎదుర్కొవలసిన పరిస్థితులు తక్కువగా మాత్రం వుండవు. వీటన్నింటిని ఎదుర్కోగల సాహసం, సహిమచగల మనోబలం వాడికి వున్నయ్యా?

విజ: క్షమించండి బాబూ! నేను లేకపోతే ఆయనపడే బాధ నాకు తెలుసు. తనలో తాను పొందగల బాధకన్న ఇతరులు పెట్టే బాధలెక్కువంటారా?

ప్రసా: నీకర్థం అయ్యేటట్లుగా చెప్పలేకపోతున్నాననుకుంటాను...వాడు కళాజీవి....వాడిలో వున్న కళ ఉజ్వలంగా ప్రకాశించాలంటే ప్రేమ కావాలి. వాడిని నాకంటే ఎవ్వరూ ఎక్కువగా ప్రేమించలేదు – నాకు తెలుసు – ఆ ప్రేమ లేనందువల్ల వాడికి మానసికమైన దౌర్బల్యం రావచ్చు. కాని అది పరిస్థితులల నెదిరించలేనిదై, ప్రమాదాలను ఆదుకోలేనప్పుడు వాడి జీవితం నిష్ప్రయోజనకరంగా తయారు కాదనగానికి హామీ ఏమిటి?

విజ: బాబూ! ఆయనను విడిచి వుండడం నాకు చేతకాదు. ఆయనా అంతే! నేను లేకపోవడం వల్ల ఆయన ఏ కొంచెం బాధపడ్డా నేను భరించలేను. నా మాట వినండి బాబూ! నేను చిన్నప్పటి నుంచీ మీ దగ్గర పెరిగాను. ఇంట్లో అందరికన్న నేనంటే ఆపేక్ష చూపించారు మీరు. ఆ చనువుతో అడుగుతున్నాను..మమ్మల్ని విడదీయకండి....నేను ఆ తరువాత ఒక్క క్షణం జీవించలేను.

ప్రసా: (ఆమె ప్రార్థనకు విచలితుడైనా, ఆయన మనోనిబ్బరమే గెలుస్తుంది) ఉద్వేగం కలిగినప్పుడు మనుషులు మామూలుగా ఆలోచించలేరు. ఇంత చెప్పినా నా మాట వినకవాడి జీవితానికి నువ్వే గుదిబండవు కాదలచుకుంటే, నా కేమీ అభ్యంతరం లేదు..అయినా మీ మీద నాకేమీ కోపం లేదు. మీ వయసులో వున్న ప్రతివాళ్ళు చేసేది అదే? ఇహ నే నంటావా? వాడు నాకు పెద్ద కొడుకు. వాడిమీద నేను ఆశలు పెట్టుకున్నాను.. ఇప్పుడు! వాడి జీవితమంతా మీరిద్దరూ వేస్తున్న తప్పటడుగువల్ల నాశనం అయిందని జీవితాంతం కుమిలిపోతాను...అందరి కన్నా ఎక్కువగా మీరిద్దరినే ప్రేమించడం వల్ల యిచ్చిన ఫలితమనుకుంటాను. వస్తానమ్మా –

విజ: (పొంగివస్తున్న దుఃఖాన్ని అతి ప్రయత్నం మీద ఆపుకుని) బాబూ! (వెడుతున్న ప్రసాదరావు వెనక్కు తిరుగుతాడు) మీ ఇష్టం వచ్చినట్టు కానివ్వండి. నా కభ్యంతరం లేదు.

ప్రసా: చూడమ్మా! ఇది నాకోసం నువ్వు చేస్తున్న త్యాగం కాకూడదు. నేను చెప్పింది వాడి కోసం. ఇందులో నా స్వార్థం ఏమీ లేదు. నువ్వు పొరపాటుగా తొందరపాటున ఏం చెప్పినా అది మీ బాధకు యింకా ఎక్కువ కారణం కావచ్చు.

విజ: లేదు బాబూ! బాగా ఆలోచించే చెబుతున్నాను. నాకు కావలసిందీ ఆయన సుఖమే కదా! నన్ను పెళ్ళిచేసుకోవడం వల్ల ఆయనకు ఓ ఒక్క బాధకలిగినా, నేను భరించలేను.

ప్రసా: బాగా ఆలోచించుకోమ్మా! నేను చెప్పానని నీ వుద్దేశ్యాలు మార్చుకోవద్దు.

విజ: అక్కర్లేదు బాబూ. అదే నా నిశ్చయం. ఆయన నన్ను పెళ్ళిచేసుకోరు..ఇహ నేనంటారా? నేను బ్రతికి చెయ్యవలసింది ఏమీ లేదు. ఉన్న సర్వస్వం త్యాగం చేసిన మనిషి ఆశించేదేముంటుంది?

ప్రసా: అంత నిస్పృహ పడకూడదమ్మా! ఎందరు నిన్ను వదిలినా, ఎందరు నన్ను వదలినా నువ్వు నాతో ఉండక తప్పదు.

విజ: ఆ పని మాత్రం నన్ను చెయ్యమనకండి బాబూ! ఇక్కడ ప్రతి వస్తువూ వారిని జ్ఞాపకం చేసేదే వాటిని చూస్తూ, నేను బ్రతకడం కల్ల – మరొకచోట నంటారా, ప్రాణాలు పోవడవ కష్టమైన పనికాదు. ఇక్కడ కృశించిపోతాను; మరొక చోట చావడం తేలిక.

ప్రసా: అలా అనడం వల్ల నాకూ బాధే కలగాలనుకుంటే నువ్వే గెలిచావు....నేనూ మనిషినే! ప్రక్క మనిషి మీద నేను సానుభూతి చూపించలేనివాడి నని ఎందుకనుకోవాలో నాకు తెలుసు.

విజ: పొరపాటు బాబుగారూ! ఆవేశంలో ఏదో అన్నాను. మిమ్మల్ని నాకంటే ఎవ్వరూ బాగా అర్థం చేసుకోలేరు.

ప్రసా: నాకు తెలుసునమ్మా! ఇప్పుడు నా కోరికల్లా నువ్వు బాధపడకుండా వుండడమే! నువ్వు ఏ మాత్రం బాధపడ్డా, నేను భరించలేను.

విజ: (విషాదకరమైన నవ్వుతో) బాధ ఎందుకు బాబూ! నాకేమీ బాధ లేదు.

ప్రసా: (ఒక్క క్షణం ఆగి) వస్తానమ్మా! నీ ప్రేమనూ, నువ్వు నాకు చూపిన గౌరవాన్నీ ఎన్నడూ మరిచిపోలేను. (వెళ్ళిపోతాడు)

(విజయ పొంగివస్తున్న దుఃఖాన్ని ఆపుకోవడానికి అనసవరమైన ప్రయత్నం చేస్తుంది. చివరకు ఆ ప్రయత్నం వల్లనే అది కట్లుతెగుతుంది. ఓ క్షణం తరువాత కుసుమ వస్తుంది. ముఖం మీద ఏదో ఒక క్రొత్తరకం సిగ్గు, ఏదో సాహసకార్యం చెయ్యడానికి ప్రయత్నించడం వల్ల మాటిమాటికి క్రింది పెదవిని కళ్ళతో నొక్కిపట్టడం వంటివి చేస్తూ వుంటుంది)

కుసు: హల్లో! విజయా! ఇక్కడా వున్నావ్! నీ కోసం ఎంతసేపటినుంచి వెదుకుతున్నానో తెలుసా? (విజయ ప్రక్కకు తిరిగి కళ్ళు తుడుచుకుంటుంది) ఏమిటది విజయా?

విజ: ఏమీ లేదు.

కుసు: నా దగ్గర దాయకు విజయా! చెప్పవూ?

విజ: లాభం లేదు కుసుమా. నా బాధలు మరొకళ్ళతో చెప్పి, వాళ్ళనూ పంచుకోమనడం న్యాయం కాదు.

కుసు: ఇంతేనా నన్నర్థం చేసుకున్నది? ఎవరు ఏం చేశారు నిన్ను? ఎందుకలా వున్నావ్? చెప్పు విజయా, నీ కోసం ఏమైనా చేస్తాను నేను.

విజ: థాంక్స్....వద్దు కుసుమ....ఆ బాధలు నన్నే పడనీ –

(త్వరగా వెళ్లిపోతుంది. ఇంట్లోనుంచి త్వరగా రామం వస్తాడు. కుసుమ నివ్వెరపోయి విజయ వెళ్ళిన వైపుగానే చూస్తూ వుంటుంది)

రామ: విజ్జీ!

కుస: రామం! –

రామ: ఓ! నువ్వా కుసుమా! నేను విజయ అనుకున్నాను.

కుసు: ఎందుకో కళ్ళనీళ్ళు పెట్టుకుంటున్నది. తీరా నేను వచ్చేసరికి కారణం చెప్పకుండానే వెళ్ళిపోయింది.

రామ: అలాగా వస్తాను....

కుసు: ఎక్కడకు సార్.....ఈ ఇంట్లో మీరు మాట్లాడవలసింది ఒక్క విజయతోనేనే?

రామ: కాదు కుసుమా, పనివుంది.

కుసు: నేనూ పనివుందనే వచ్చాను సార్.....(రామం నిస్పృహతో కూర్చుండిపోతాడు) కోపం వచ్చిందా?

రామ: అబ్బే!

కుసు: (దగ్గరకు వచ్చి) ఇవ్వాళ నీకు ఎన్ని విషయాలు చెబుదామని వచ్చాననుకున్నావ్?

రామ: చెప్పు –

కుసు: అబ్బ.....అంత తేలికగా చెబుతావా? నువ్వు చెప్పుకో –

రామ: అంత మరీ చిన్నపిల్లవు కాకు కుసుమా. సంగతేమిటో చెప్పు......

కుసు: అట్లా అని తప్పించుకోవడానికి చూడకండి.....మీకు తెలుసు, చెప్పండి.

రామ: (రామం, కసిగా) ఆ, ఏముంటుంది? మీ నాన్నగారు ఢిల్లీ ఆలిండియా రేడియోలో మాట్లాడారనో, మీ మామయ్య పారిస్ నుంచి బ్రహ్మాండమైన చీరలు తెచ్చాడనో, ఇంకా –

కుసు: పప్పులో కాలువేశారు సార్.....అవ్వేమీ కావు.

రామ: కుసుమా! నాకు అవతల చాలా పనివుంది. చంపక చప్పున చెప్పు, అంతటి గొప్ప విషయం ఏమిటో!

కుసు: ఈ మగవాళ్లందరూ యింతే! ఆడవాళ్ళు ఎంత ఆప్యాయంగా దగ్గరకు వచ్చినా ముఖం మాడ్చుకుంటారు.

రామ: ఆడవాళ్ళు మాత్రం తక్కువతిన్నారా? అయినప్పుడూ కానప్పుడూ కూడా మా మీద స్వారీ చెయ్యడంలా.... మళ్ళీ ఒక్క మాటంటే మీ అబలా సమాజమంతా కత్తి కట్టి మా ఇళ్ళమీదకు యుద్ధానికి వస్తుందే! సరే! నేను బుద్ధివంతుడిలా కూర్చుంటాను. త్వరగా చెప్పు.....

కుసు: అట్లా అన్నారు, బావుంది. చెప్పనా? మా నాన్నగారు మీ నాన్నగారి దగ్గరకు వస్తున్నారు?

రామ: రానీ! దానిలో గొప్ప ఏముంది?

కుసు: తగ్గుమరి ఎందుకో తెలుసా? మా నాన్నగారు మీ నాన్నగారి దగ్గరకు వచ్చి మీ అబ్బాయికి మా అమ్మాయిని ఇస్తాం – చేసుకోండి" అంటారు –

రామ: (ప్రాణం లేని నవ్వుతో) అలాగా!

కుసు: ఏమంటావు రామం?

రామ: (కుర్చీలోనుంచి లేచి) కుసుమా! ఈ సంగతి నాకు చూచాయగా తెలియకపోలేదు. ఒక్క మాట చెబుతాను; నా మీద కోపగించకు కుసుం....నేను విజయను పెళ్ళిచేసుకోబోతున్నాను –

కుసు: (నూతిలో గొంతుకలా) విజయనా!

రామ: అవును కుసుం....నాన్నగారు ఒప్పుకోలేదు. అందువల్ల మరోగంటలోనే యిక్కడినుంచి వెళ్ళిపోతున్నాం. ఇప్పుడు నీకు ఆశ కలిగించడం నాకు సుతారామూ ఇష్టం లేదు. నువ్వు నన్ను ప్రేమించావని నాకు తెలుసు. కాని నేనేం చెయ్యగలను, చెప్పు? ఎన్ని అడ్డంకులు వచ్చినా, నేను విజయను పెళ్ళి చేసుకోదలిచాను.

కుసు: (తన చేతుల్లో ముఖాన్ని దాచుకుని) రామం!

రామ: కుసుం! నువ్వు బాధపడతావని నాకు తెలుసు. కాని ఏం చెయ్యను?

కుసు: (తేరుకుని) పోనీ రామం! నువ్వేం చెయ్యగలవు? ఇంతకూ నా అదృష్టం....అయినా గాలిలో మేడలు కట్టబోయేముందు వాటికి పునాదులుంటే కాని పడకుండా వుండవన్న జ్ఞానం నాకు లేకపోయింది. ఇప్పుడనుకుని ఏం లాభం?...సరే! మీరైనా సుఖంగా వుండండి. నీకు ఏం అవసరం వచ్చినా నాకు చెప్పకుండా వుండవు కదూ! నేను ఎప్పుడూ నీ పక్షమే!

రామ: (ఆమెకు తనమీద వున్న ప్రేమకు ఆశ్చర్యపడతాడు, చలిస్తాడు) కుసుం!

కుసు: వస్తాను, రామం.....

(మెల్లగా వెళ్ళిపోతుంది. ఒక క్షణం తర్వాత సూర్యం, 'కుసుం, కుసుం' అని పిలుస్తూ వస్తాడు)

సూ: కుసుమ ఏదిరా?

రామ: వెళ్ళిపోయింది.

సూ: ఏం.

రామ: ఈ ఇంట్లో తనకు స్థానం లేదని –

సూ: ఈ నాటకం ఇంత ఎక్కువ కాలం జరగడం బాగులేదురా. నాన్నను రానీ, ఎందుకు ఒప్పుకోడో చూస్తాను.

రామ: నాన్నను ఒప్పించడం బ్రహ్మతరం కాదు.

సూ: మనం ఆయన తలలోనుంచి వెళ్ళుకు వచ్చాంరా – చూస్తావుగా!

(ఇంతలో ప్రసాదరావుగారు కుసుమను పిలుస్తూ వస్తాడు)

సూ: (రామం వైపుకు తిరిగి) ఏదిరా?

రామ: వెళ్లిపోయింది.

ప్రసా: ఏం?

సూ: బహుశః తనకీ ఇంట్లో స్థానం లేదని తెలుసుకుని వుంటుంది.

ప్రసా: సూర్యం –

సూ: ఈ నాటకాన్ని ఇంతసేపు సాగనివ్వడం ఏమీ బాగులేదు.

ప్రసా: ఏమంటావ్?

సూ: నిజాన్ని గ్రహించి, నీతితో జవాబు చెప్పమంటాను.

ప్రసా: ఇందులో నాదేముంది? వాళ్ళ ఇష్టం –

సూ: వాళ్ళ యిష్టాయిష్టాలతో సాగితే నాటకం, ఎప్పుడో సుఖాంతం అయ్యేది. ఈ 'సస్పెన్సు' దేనికి?

ప్రసా: నీకీ గొడవలు తెలియవుగాని, నీ నాటకాలు ఏమిటో నువ్వు చూసుకో –

సూ: జీవితంలో నాటకాల తర్వాత కదా, స్టేజీ మీద నాటకాలు!

ప్రసా: అయితే, ఈ నాటకంలో నీ పాత్ర ఏమిటి?

సూ: అదే అర్థం కావడం లేదు...నేనే కథానాయకుణ్ణయితే ఇంత రాద్ధాంతం వుండేదా? అన్నయ్య మెత్తటివాడు కాబట్టి మొదుతున్నారు.

ప్రసా: నీ కెందుకురా యివన్నీ? ఎవరి సంగతి వాళ్ళు చూసుకోలేరా ఏం?

సూ: తన సంగతి తాము చూచుకోక, ప్రక్కవాళ్ళ సంగతుల్లో తల దూర్చేవాళ్ళు వున్నారు కాబట్టే నేను వచ్చాను.

ప్రసా: అంత అవసరం ఎవరికి?

సూ: అదేమిటి నాన్నా? అంతస్థుల పేరు చెప్పి అన్నయ్యను జడిపించడం, వాడి భవిష్యత్తు పేరుతో విజయను భయపెట్టడం – ఇవన్నీ యేమిటి?

ప్రసా: నేను మంచిదనుకున్నది వాళ్ళకు చెప్పాను. వాళ్ళు దాన్ని పాటించకపోతే – వాళ్ళ ఖర్మ – పోతారు. నేనేం వద్దనలేదే!

సూ: వేసే బ్రేకులు వేస్తుంటే వాళ్ళు మాత్రం ఎలా వెడతారు లెండి.

ప్రసా: నీ ధర్మసన్నాలు ఎవ్వరికీ అక్కరలేదు.

సూ: అక్కరలేని వాళ్ల కోసం ధర్మసన్నాలు ఎవ్వరూ చెప్పరు నాన్నా! అయినా ఈ పెళ్ళి ఆగడానికి వీలులేదు. ఎలా జరగదో నేనూ చూస్తాను (విజయ వస్తుంది) చెప్పు విజయా! నాకు రామాన్ని పెళ్ళిచేసుకోవడం యిష్టమా, కాదా? ఆ మాట ఆయన ముఖాన చెప్పు – సంవత్సరం నుంచీ మీ హృదయాలు కలుసుకోవడానికి నిరంతరం ఆరాటపడ్డవని చెప్పు....మీ జీవితాలు కలుసుకున్న తర్వాత, ఎంతటి అవాంతరాలనైనా, చిరునవ్వులతో ఎదిరించగలమని చెప్పు. మీ ఆనందానికి అవధి లేదని, మీ సుఖానికి పరిధి లేదని చెప్పు – చెప్పు, విజయా! (విజయ మాట్లాడదు)

ప్రసా: చెప్పడం చెప్ప మన్నంతం తేలిక కాదోయ్!

సూ: హృదయంలో వున్నప్పుడు చెప్పడం, చెప్పమనడం కన్న తేలిక –

(ఇంతలో రంగయ్య వస్తాడు)

రంగ: నమస్కారం బాబూ! ఏమిటిదంతా? నాటకంగాని వెయ్యడం లేదు కదా!

ప్రసా: అలాంటిదే రంగయ్యా! చూస్తూ వుండు.

రామ: రంగయ్యా! నేను విజయను పెళ్ళిచేసుకోబోతున్నాను.

రంగ: (ఆశ్చర్యంతో) ఏమిటి బాబూ!

సూ: అవుఉ రంగయ్యా! నిజమే! అన్నయ్య విజయను పెళ్ళిచేసుకోబోతున్నాడు.

రంగ: బావుంది బాబూ! గోపాలం కూడా సీతను చేసుకోవడానికి ఒప్పుకున్నాడు. బాబూ! ఇదంతా మీ మాటల చలవే బాబూ! వాడు ఇంటికి వచ్చి, రాత్రంతా ఆలోచించి "బాబుగారు చాలా నిజం చెప్పారు నాన్నా!" అన్నాడు. "వారెప్పుడూ అలాగే చెబుతార్రా" అన్నాను. అంతే – చేసుకోవడానికి ఒప్పుకున్నాడు...బావుంది కదూ!

ప్రసా: కాని, నాకు వీళ్ళ పెళ్ళి జరగడం ఏమీ యిష్టం లేదు రంగయ్యా!

రంగ: బాబూ!

ప్రసా: అవునయ్యా! ఈ పెళ్ళి జరగడం నాకేమీ యిష్టం లేదు.

సూ: ఎందుకు వుంటుంది రంగయ్యా! అంతస్థుల పేరు చెప్పి, అవకాశాలను అవరోధించడం రాజకీయ నాయకులకు తప్ప మరొకరికి చేత కాదు.

రంగ: అదేమిటి బాబూ! విజయ చిన్నప్పటినుంచి మీ దగ్గర పెరిగింది. దాన్ని నా పిల్ల అని ఎప్పుడూ అనుకోలేదు. అటువంటి వాళ్ళను మీరు విడదీస్తారా? అంతస్థుల భేదం పాటించకూడదని మొన్న నేగా మీరు చెప్పారు. మీరు చెప్పినట్లు చెయ్యకపోతే గోపాలానికి వుద్యోగమివ్వమని బెదిరించారు. ఇదేనా మీరు చేస్తున్న న్యాయం?

సూ: ఏమిటి రంగయ్యా, పాతకాలం నాటి మాటలు మాట్లాడుతున్నావ్! ఈ రోజుల్లో న్యాయం చెయ్యడం పాపం.

రంగ: బాబూ! నా మాట వినండి. వాళ్ళ ఆనందానికి అడ్డు రాకండి.

ప్రసా: అదేమిటయ్యా, రంగయ్యా! నీ పిచ్చి కాని, వాళ్ళు సుఖపడతామంటే నేను వద్దంటానా? నాకు మాత్రం వాళ్ళు ఏమీ కారా?

సూ: అందుకేనా నాన్నా, ఈ పెళ్ళికి నా కిష్టం లేదంటున్నారు!! అంతస్థులు జీవితాల వినాశనానికి కారణం అవుతాయని మీ నమ్మకమే అయితే, ఈ మాటే గోపాలానికి కూడా చెప్పివుండవలసింది.

విజ: సూర్యం!...నాన్నగారినేమీ అనకు... పెళ్ళి నాకే ఇష్టం లేదు.

(సూర్యం, రామం, రంగయ్యా ముగ్గురూ ఒక్కసారిగా 'విజయా' అంటారు)

విజ: (తననను తాను నిగ్రహించుకుంటూ) అవును....నాకే ఇష్టం లేదు.

సూ: విజయా! పరిస్థితులకు లొంగిపోయి నువ్వు ఇప్పుడేం చెప్పినా, జీవితాంతం విచారించవలసివస్తుంది.

రామ: విజయా! నువ్వేనా ఆ మాటలు అనగలిగింది!

సూ: భయపడకు విజయా! ధైర్యంగా నిజాన్ని చెప్పగలిగినవాళ్ళే, నిజంగా బ్రతకడానికి అర్హులు.

విజ: (గాద్గదికంగా) నేను నిజమే చెబుతున్నాను సూర్యం.....నేనీ పెళ్ళి చేసుకోలేను.

రామ: ఏం?

విజ: ఆ సంగతి నన్ను అడగకు చినబాబూ! మీ సుఖంకోసం నేను ఈ పెళ్ళిని మానివేస్తున్నాను.

రామ: (మాటలు రాక) ఓ!

సూ: (పెదవి విరిచి) ఇక జీవితం నాటకం కాగల దని ఎవరనగలరు?

విజ: (ఒక క్షణం ఆగి)...వెడదాం, పద నాన్నా!

రంగ: వస్తాం బాబూ! నేనన్నవన్నీ మనసులో వుంచుకోకండి.

ప్రసా: విజయా! మరోసారి అడుగుతున్నాను. నువ్వు ఇక్కడ వుండలేవా?

విజ: క్షమించండి బాబూ! నన్ను ఆమాట మాత్రం అడగకండి.

ప్రసా: కాని విజయా! నా మీద కోపంతో మాత్రం వెళ్ళడం లేదని, మీ కష్టాలకు నేను కారణం కాదని చెప్పి వెళ్లు. అదే నాకు ఊరట నిస్తుంది.

విజ: మీ మీద కోపమెందుకు బాబూ?..మీ దయాబుుణాన్ని ఎన్నడైనా తీర్చుకోగలమా? (రామానికి దగ్గరగా వస్తుంది)

రామ: (దుఃఖాన్ని ఆపుకోలేక) విజయా!

విజ: చినబాబూ! నన్ను మరచిపోవడానికి ప్రయత్నించండి. నేనేం చేసినా, మీ కోసమేనని నమ్మండి..... సూర్యం! నీ వైపు చూడడానికే భయంగా వుంది. నన్ను క్షమిస్తావు కదూ! పద, నాన్నా!

రంగ: వస్తాం, బాబూ! (రంగయ్య, విజయ, వాళ్ళ వెనక ప్రసాదరావు వెడతారు)

సూ: కథ అడ్డం తిరిగింది కదా!

(రామం పిచ్చివాడిలా వుంటాడు. ఇంతలో చంద్రం వస్తాడు)

చం: సారీ బ్రదర్! కొంచెం లేటయింది. ఏ సీను వేస్తున్నారు?

సూ: సీనేమిట్రా నీ తలకాయ! నాటకమే అయిపోతే!

చం: అంటే –

సూ: అంటే ఏమిటి? రిహార్సల్సు లేకుండానే నాటకం ఆడబడ్డది.

చం: మరి కుసుమ యేది?

సూ: వెళ్ళిపోయింది.

చం:	విజయ – ?

సూ:	ఆమెనూ వెళ్ళకొట్టాం......

(ఈ మాటలతో రామం పిచ్చివాడిలా నవ్వుతూ, 'అవును, వెళ్ళకొట్టాం' అంటూ వాకిట్లోకి వెళ్ళిపోతాడు)

చం:	మరి కథానాయిక ఎవర్రా?

సూ:	కథానాయిక ఎవరో వుంటే ఇంకా నాటకం విషాదాంత ఎందుకు అవుతుందిరా?

చం:	అసలేం జరిగింది?

సూ:	ఏముంది? కొందరు మేడమీదనుంచి దిగి రానూలేరు, మరెవ్వరిని పైకి రానివ్వనూ లేరు. వాళ్ళ వల్ల అందరూ బాధపడతారు.

చం:	మరి ఇది సుఖాంతం కావడం ఎప్పుడు?

సూ:	ఈ ఆటంకాలను అధిగమించడానికి ధైర్యం వున్న యువతీ యువకులు ముందుకు వచ్చిన నాడు. ఇది దానంతట అదే సుఖాంతం అవుతుంది.

చం:	అంతవరకూ ఎదురుచూద్దామా –

సూ:	అవును మరి. కళోపాసకులు, భవిష్యత్తు మీద ఆశ వున్నవాళ్ళు నాటకంలో పాత్రధారులైనప్పుడు, ఈ నాటకం ఎప్పుడూ సుఖాంతమే! ఆ రోజు తప్పక వస్తుంది.

చం:	ప్రస్తుతం ఇది విషాదాంతమే కదా!

సూ:	తప్పదు మరి.....తప్పకుండా విషాదాంతమే!!

(మొదట ఎలావుందో ఇప్పుడూ అలాగే ఆలోచిస్తూ వుంటారు. ఇద్దరూ పెదవులు విరిచి 'అవును, విషాదాంతం' అనుకుంటారు)

సూ:	(హఠాత్తుగా లేచి (ప్రేక్షకులతో) చూశారుగా, ఇదీ నాటకం – ఇది విషాదాంతమని వేరే చెప్పనక్కర్లేదు కదూ! –

చంద:	అవును...విషాదాంతం –